ప్రజా వాయిస్

PRAJA VOICE ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 20 | ఎడిటర్: మేనం శ్యామ్ | శనివారం 08-08-2026 | పేజీలు: 10

సిరా చుక్క

పుస్తకం పట్టాల్సిన చేతిలో
నేడు గంజాయి పొట్లం కనిపిస్తోంది...
భవిష్యత్తును నిర్మించాల్సిన వయసులో,
యువతే తమ భవిష్యత్తును నాశనం
చేసుకుంటోంది.
అమ్మానాన్నల ఆశలు
కళ్లలో మెరవాల్సిన చోట,
మత్తు పొగలు జీవితాన్ని
చీకటిలోకి నెట్టేస్తున్నాయి.
పగలు, రాత్రి అనే తేడా లేకుండా...
గంజాయి మత్తులో మునిగిపోతున్న యువత
ఎటు వెళ్తుందో, ఏమవుతుందో
అర్థం కాని పరిస్థితి నెలకొంది.
గుడి వెనుకైనా, వీధి చివరైనా
అదే మత్తు దృశ్యాలు కనిపిస్తున్నాయి.
చిన్నా పెద్దా అనే తేడా లేకుండా,
స్నేహం పేరుతో మొదలైన ఈ అలవాటు...
చివరికి అనేక కుటుంబాలను
కన్నీటి సముద్రంలో ముంచేస్తోంది.
ఆడపిల్లల పట్ల కూడా
అసభ్య ప్రవర్తన పెరుగుతూ,
సమాజం తీవ్ర ఆందోళనలో ఉంది.
ఇంట్లో సురక్షితంగా ఉండాల్సిన
ఆడపిల్లలు కూడా
బయటకు రావాలంటే భయపడే
పరిస్థితి ఏర్పడుతోంది.
సభ్య సమాజం ఎటు దారితీస్తుందో
అర్థం కాని స్థితి ఇది.
ఒకప్పుడు కలల కోసం పరుగులు తీసిన కాళ్లు,
నేడు మత్తు కోసం వీధులు వెతుకుతున్నాయి.
దేశానికి దిక్సూచి కావాల్సిన యువత,
మత్తుకు బానిసై దారి తప్పుతోంది.
గంజాయి క్షణిక ఆనందాన్ని ఇస్తుంది...
కానీ జీవితాంతం బాధను మిగులుస్తుంది.
యువతకు ప్రజా వాయిస్ పత్రిక తరపున విజ్ఞప్తి...
మత్తుకు కాదు... మనసుకు బానిసలవ్వండి.
గంజాయికి కాదు... గమ్యానికి దగ్గరవ్వండి.
పుస్తకాన్ని పట్టుకోండి... మీ జీవితాన్ని
బంగారంగా మలుచుకోండి.

— పానుగంట్ల హరి,
లక్ష్మీదేవిగూడెం ..

రాష్ట్ర సుభిక్షం కోసం మహా వరుణ యాగం

ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో ఘనంగా నిర్వహణ!

- రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం
- నాగార్జునసాగర్‌లో 108 మంది వేదపండితులతో శాస్త్రోక్తంగా మహా వరుణ యాగం
- 11 హోమగుండాల్లో ప్రత్యేక పూజలు.. ఆగస్టు 10న సకల పూర్ణాహుతి
- రైతాంగ శ్రేయస్సు, నదులు-జలాశయాలు నిండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రార్థనలు

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, కృష్ణా-గోదావరి నదులతో పాటు చెరువులు, జలాశయాలు జలకళతో నిండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహా వరుణ యాగాన్ని నిర్వహించనుంది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన ముహూర్తం మేరకు ఆగస్టు 10న నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో ఈ యాగం నిర్వహించనున్నారు.

వర్షాభావ నివారణకు ఆధ్యాత్మిక సంకల్పం

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రకృతి అనుగ్రహం లభించి సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ మహా వరుణ యాగానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర సంక్షేమం, రైతాంగ శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా ఈ యాగాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు.

108 మంది వేదపండితులతో మహా యాగం

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో యాగం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విజయవిహార్ ప్రాంగణంలో ప్రత్యేకంగా 11 హోమగుండాలను ఏర్పాటు చేస్తున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి చెందిన 108 మంది వేదపండితులు, ఋత్వికులు శాస్త్రోక్తంగా యాగ క్రతువులను నిర్వహించనున్నారు.

22 లక్షల ఎకరాలకు సాగునీరు అందాలనే ఆకాంక్ష

నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని సుమారు 22 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని యాగంలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, జలాశయాలు నిండిపోయి ప్రజలకు తాగునీటి, సాగునీటి కొరత

మిగతా 2లో

గిగ్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్

- ఆగస్టు 15లోగా కొత్త నిబంధనలు
- గిగ్, ప్లాట్ఫామ్ వర్కర్ల సమస్యలపై మంత్రి వివేక్‌తో కీలక సమావేశం
- బేస్ ప్రైస్, కనీస ఆదాయ భద్రతపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం
- ఆగస్టు 15లోగా కొత్త నిబంధనలు తీసుకొస్తామని మంత్రి హామీ
- ప్రభుత్వ హామీతో రాష్ట్రవ్యాప్త సమ్మె విరమించిన టీపీడీఎఫ్

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా సేవలు అందిస్తున్న గిగ్, ప్లాట్ఫామ్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. గిగ్ అండ్ ప్లాట్ఫామ్ వర్కర్స్ యూనియన్ల ప్రతినిధులతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలు, డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు.

బేస్ ప్రైస్‌పై ప్రభుత్వ హామీ

సమావేశంలో క్యాబ్ డ్రైవర్లు, ఫుడ్, పార్శిల్ డెలివరీ కార్మికులు ఎదుర్కొంటున్న వేతన వ్యత్యాసాలు, కనీస ఆదాయ భద్రత, బేస్ ప్రైస్ (కనీస ఛార్జీలు) నిర్ణయం వంటి ప్రధాన అంశాలను యూనియన్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బేస్ ప్రైస్‌ను నిర్ణయించేందుకు

మిగతా 2లో

జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డిపై అత్యాచార కేసు నమోదు

- అమీన్పూర్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు
- బీఎన్ఎస్, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు
- గతంలో లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన సీఐ
- సహజీవనం పేరుతో వేధింపులు, బెదిరింపులు, డబ్బుల వసూళ్ల ఆరోపణలు

2 లో

తెలంగాణలో అధికారమే లక్ష్యం ఎవరితోనూ పొత్తు లేదు

- తెలంగాణలో అధికారమే లక్ష్యమన్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు
- జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని స్పష్టీకరణ
- 937 మండలాల్లో పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ
- రాష్ట్రంలో అవినీతిపై పోరాటం ఉధృతం చేయాలని బీజేపీ జాతీయ నాయకత్వం సూచన

ప్రజా వాయిస్, హైదరాబాద్: తెలంగాణలో అధికారంలోకి రావడమే భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే విషయంలో ఏ రాజకీయ పార్టీతోనూ పొత్తు ఉండదని తేల్చిచెప్పారు. జనసేనతో సహా తెలంగాణలో ఏ పార్టీతోనూ ఎన్నికల పొత్తు ఉండదని పేర్కొంటూ, అయితే జాతీయ స్థాయిలో జనసేన ఎన్డీయే కూటమిలో భాగస్వామి కావడంతో ఆ అంశంపై నిర్ణయం జాతీయ నాయకత్వమే తీసుకుంటుందని వెల్లడించారు.

బీజేపీ బలోపేతంపై జాతీయ నాయకత్వంతో సమీక్ష

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పార్టీ బలోపేతం, నియోజకవర్గాల వారీగా సంస్థాగత పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. సమావేశం అనంతరం

మిగతా 2లో

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి మళ్లీ పోలీసు కస్టడీకి?

- రెండు రోజుల పోలీసు కస్టడీ ముగింపు
- విచారణకు సహకరించలేదని పోలీసుల వాదన
- కీలక ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు నిరాకరించినట్లు సమాచారం
- మరోసారి కస్టడీ కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసుల పిటిషన్
- శనివారం పిటిషన్‌పై కోర్టు విచారణ జరిగే అవకాశం

2 లో

కృష్ణా జలాలపై ఈనెల 13న కీలక సమావేశం

- హైదరాబాద్‌లో కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ భేటీ
- హైదరాబాద్‌లో ఈనెల 13న కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం
- శ్రీశైలం, నాగార్జునసాగర్ నీటి నిల్వలు, రెండు రాష్ట్రాల అవసరాలపై చర్చ
- తెలంగాణ, ఏపీ ఇరిగేషన్ ఈఎన్సీలకు తప్పనిసరి హాజరు
- 2025-26, 2026-27 నీటి సంవత్సరాల నీటి ఖాతాలు సమర్పించాలని ఆదేశం

ప్రజా వాయిస్, హైదరాబాద్: కృష్ణా నది జలాల వినియోగంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కీలక సమావేశం ఈ నెల 13న జరగనుంది. కృష్ణా నది నిర్వహణ బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ సమావేశాన్ని ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని కేఆర్ఎంబీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు బోర్డు సభ్య కార్యదర్శి సతీష్ కంబోజ్ వెల్లడించారు.

నీటి నిల్వలు, అవసరాలపై సమీక్ష

ఈ సమావేశంలో శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తాగునీరు, సాగునీటి అవసరాలు, నీటి వినియోగంపై సమగ్రంగా చర్చించనున్నారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి వినియోగానికి సంబంధించిన తాజా పరిస్థితులను సమీక్షించనున్నారు.

ఈఎన్సీలకు తప్పనిసరి హాజరు

సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల ఇరిగేషన్ శాఖల ఇంజినీర్-ఇన్-చీఫ్‌లు (ఈఎన్సీలు) తప్పనిసరిగా హాజరుకావాలని కేఆర్ఎంబీ ఆదేశించింది. సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ

మిగతా 2లో

సందీప్ కుమార్ సుల్తానియాపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

- అన్ని కేసుల్లో శిక్షిస్తే జీవితమంతా జైలులోనే ఉండాల్సి వస్తుంది
- అధికారులను పదేపదే కోర్టుకు పిలవడం బాధాకరమన్న హైకోర్టు
- కంటోన్మెంట్ బోర్డుకు రూ.33 కోట్ల బకాయిల కేసులో తీవ్ర వ్యాఖ్యలు
- సంక్షేమ పథకాల లబ్ధి నిజమైన అర్హులకే చేరాలని హైకోర్టు సూచన
- రూ.25 కోట్లు విడుదల చేశామని.. మిగతా నిధులు త్వరలో చెల్లిస్తామని సుల్తానియా వెల్లడి

2 లో

సికింద్రాబాద్ బోనాల చెక్కుల పంపిణీలో రసాభాస

- కాంగ్రెస్-బీఆర్ఎస్ నేతల మధ్య ప్రోటోకాల్ వివాదం
- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ రాకముందే చెక్కుల పంపిణీపై బీఆర్ఎస్ ఆగ్రహం
- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చెక్కులు పంపిణీ చేయడంపై అభ్యంతరం
- సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు.. ఇరువర్గాల మధ్య తోపులాట
- ఎమ్మెల్యే రాకతో వివాదం సద్దుమణిగి చెక్కుల పంపిణీ పూర్తి

ప్రజా వాయిస్, హైదరాబాద్: సికింద్రాబాద్ బోనాల సందర్భంగా దేవాలయ కమిటీలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రోటోకాల్ అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో కార్యక్రమం కొంతసేపు గందరగోళంగా మారింది.

ప్రోటోకాల్‌పై బీఆర్ఎస్ అభ్యంతరం

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ రాకముందే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చెక్కుల పంపిణీ ప్రారంభించడాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. స్థానిక ఎమ్మెల్యే లేకుండానే చెక్కులు పంపిణీ చేయడం ప్రోటోకాల్‌కు విరుద్ధమని ప్రశ్నించారు.

నినాదాలతో ఉద్రిక్తత

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓడిపోయిన వ్యక్తులు వేదికపై ఎలా ఉంటారని ప్రశ్నిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఉద్రిక్తత

పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను విడదీశారు. ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలను కార్యక్రమం ప్రాంగణం బయటకు పంపించారు. దీంతో కొద్దిసేపు సమావేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ఎమ్మెల్యే రాకతో ముగిసిన వివాదం

తర్వాత ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ కార్యక్రమానికి చేరుకోగా, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆయనను వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కుల పంపిణీ జరగడంతో వివాదం సద్దుమణిగింది. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు తమ ఆందోళనను విరమించారు.

భద్రాద్రిలో బీఆర్ఎస్ నేతపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- వివాహిత మహిళ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు
- న్యూడ్ వీడియో కాల్స్, మార్ఫింగ్ ఫొటోలతో బెదిరించారని ఆరోపణ
- అప్పు వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు
- కేసుపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితుడిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి డిమాండ్

పాల్వంచ, ప్రజావాయిస్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో బీఆర్ఎస్ నాయకుడు బొమ్మిడి రమాకాంత్‌పై ఓ వివాహిత మహిళ చేసిన ఫిర్యాదుతో పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. తనను లైంగికంగా వేధించడంతో పాటు నగ్న వీడియో కాల్స్, మార్ఫింగ్ చేసిన ఫొటోలతో బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.బాధితురాలు ప్రెస్‌క్లబ్‌లో మీడియా తో మాట్లాడుతూ, గతంలో తీసుకున్న అప్పు వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని తన వద్ద ఉన్న ఖాళీ చెక్కును దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తాను తీసుకున్న మొత్తానికి మించి రూ.8.50 లక్షలతో చెక్కు నింపి చెక్‌బౌన్స్ కేసు నమోదు చేసి, అనంతరం ఒత్తిడి తీసుకొచ్చారని పేర్కొన్నారు.అంతేకాకుండా, నిందితుడు పలుమార్లు నగ్న వీడియో కాల్స్ చేసి, మార్ఫింగ్ చేసిన ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానంటూ బెదిరించాడని ఆరోపించారు. శారీరకంగా సహకరించకపోతే చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని ఆమె వెల్లడించారు.ఈ వ్యవహారంలో సాయి అనే వ్యక్తి కూడా తన ఖాళీ చెక్కును దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ, ఆయనపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.జూలై 25న పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని బాధితురాలు తెలిపారు. కేసు నమోదైన తర్వాత కూడా రాజకీయ పలుకుబడి ఉందంటూ తనను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.అదే విధంగా, తాను ఓ రాజ్యసభ సభ్యుడి పీఏగా, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నానని చెప్పుకుంటూ కేసును ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారని కూడా బాధితురాలు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. కాబట్టి ఇవి ప్రస్తుతం ఆరోపణలుగానే ఉన్నాయి.బాధితురాలు తనకు, తన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించడంతో పాటు కేసుపై నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి నిజానిజాలు వెలికితీయాలని పోలీసులను కోరారు.

గిగ్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఆగస్టు 15లోగా కొత్త నిబంధనలు

గిగ్, ప్లాట్ఫామ్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 15వ తేదీలోగా కొత్త నిబంధనలను తీసుకువస్తామని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ నిబంధనల ద్వారా వర్కర్లకు మెరుగైన రక్షణ, ఆదాయ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

విరమించిన రాష్ట్రవ్యాప్త సమ్మె

ప్రభుత్వం ఇచ్చిన హామీ నేపథ్యంలో శనివారం (ఆగస్టు 8) నుంచి చేపట్టాలని నిర్ణయించిన రాష్ట్రవ్యాప్త సమ్మెను విరమిస్తున్నట్లు తెలంగాణ అగ్రిగేటర్స్ అండ్ డ్రైవర్స్ ఫెడరేషన్ (టీఏడీఎఫ్) ప్రతినిధులు అధికారికంగా ప్రకటించారు.

వేలాది మంది వర్కర్లకు ఊరట

ప్రభుత్వ చొరవతో గిగ్, ప్లాట్ఫామ్ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ భాగస్వాములకు తక్షణ ఉపశమనం లభించనుంది. ప్రభుత్వం తీసుకురానున్న కొత్త నిబంధనలపై గిగ్ వర్కర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర సుభిక్షం కోసం మహా వరుణ యాగం
ఆగస్టు 10న
నాగార్జునసాగర్‌లో ఘనంగా నిర్వహణ!

లేకుండా ఉండాలని సంకల్పంతో యాగం చేపడుతున్నారు.

సకల పూర్ణాహుతిలో సీఎం పాల్గొననున్నారు

యాగంలో అత్యంత ప్రధానమైన సకల పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆగస్టు 10న మధ్యాహ్నం 3:20 గంటల నుంచి 3:24 గంటల మధ్య నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

యాగ ఏర్పాట్లు ముమ్మరం

మహా వరుణ యాగానికి సంబంధించిన ఏర్పాట్లను నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, దేవాదాయ శాఖ అధికారులు, యాదగిరి గుట్ట ఆలయ అర్చకులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర సంక్షేమం, ప్రకృతి అనుగ్రహం కోసం నిర్వహిస్తున్న ఈ మహా యాగంపై రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

సందీప్ కుమార్ సుల్తానియాపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

ప్రజా వాయిస్, హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియాపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అధికారులను పదేపదే కోర్టుకు పిలిచి బోనులో నిలబెట్టడం తమకు కూడా బాధాకరంగా ఉందని పేర్కొంది. ఆయనపై నమోదైన అన్ని కోర్టు ధిక్కరణ పిటిషన్లలో శిక్షలు విధిస్తే జీవితకాలం జైలులోనే ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెల్లించాల్సిన రూ.33 కోట్ల స్టాంప్ డ్యూటీ సర్‌ఛార్జి బకాయిల కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

అధికారులపై కోర్టు అసంతృప్తి

జస్టిస్ నగేష్ భీమపాక నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా ప్రభుత్వ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పాలనాపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బాధ్యతాయుతమైన అధికారులు ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందని అభిప్రాయపడింది. ఉన్నతాధికారులను తరచూ కోర్టుకు హాజరు కావాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొంది.

బకాయిల చెల్లింపులపై విచారణ

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన రూ.33 కోట్ల స్టాంప్ డ్యూటీ సర్‌ఛార్జి బకాయిలు విడుదల చేయకపోవడంతో దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ జరిగింది. గత విచారణకు హాజరుకాకపోవడంతో సందీప్ కుమార్ సుల్తానియాపై హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా, తాజాగా ఆయన స్వయంగా కోర్టుకు హాజరై వివరణ ఇచ్చారు.

సంక్షేమ పథకాలపై ఆసక్తికర వ్యాఖ్యలు

విచారణ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపైనా హైకోర్టు స్పందించింది. రైతు బంధు వంటి పథకాలు మంచి ఉద్దేశంతో అమలు చేస్తున్నప్పటికీ, సరైన వర్గీకరణ లేకపోవడం వల్ల కోటీశ్వరులు, అనర్హులు కూడా ప్రయోజనాలు పొందుతున్నారని పేర్కొంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు నిజమైన పేదలు, అర్హులైన లబ్ధిదారులకే చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

రూ.25 కోట్లు విడుదల..

విచారణ 19కు వాయిదాకోర్టు ముందు స్పందించిన సందీప్ కుమార్ సుల్తానియా.. కంటోన్మెంట్ బోర్డుకు ఇప్పటికే రూ.25 కోట్ల నిధులు విడుదల చేశామని, మిగిలిన బకాయిలను కూడా విడతల వారీగా చెల్లిస్తామని తెలిపారు. ఈ వివరణతో సంతృప్తి చెందిన హైకోర్టు కేసు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి మళ్లీ పోలీసు కస్టడీకి?

ప్రజా వాయిస్, హైదరాబాద్: లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. కస్టడీలో జరిగిన విచారణలో ఆయన పోలీసుల ప్రశ్నలకు సహకరించలేదని సమాచారం. అనేక కీలక ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు నిరాకరించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి.

విచారణకు సహకరించలేదన్న పోలీసులు

విచారణలో కీలక విషయాలపై ఉదయ్ కృష్ణారెడ్డి స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని పోలీసులు కోర్టుకు తెలిపారు. కేసు దర్యాప్తుకు అవసరమైన మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉన్నందున మరోసారి కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

శనివారం కోర్టులో విచారణ

పోలీసులు దాఖలు చేసిన తాజా కస్టడీ పిటిషన్‌పై శనివారం ఉప్పర్‌పల్లి కోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. కోర్టు నిర్ణయం అనంతరం తదుపరి దర్యాప్తు దిశపై స్పష్టత వచ్చే అవకాశముంది.

లైంగిక వేధింపుల కేసులో దర్యాప్తు

సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసులు నమోదయ్యాయి. అత్తాపూర్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరోసారి కస్టడీపై ఉత్కంఠ

ఉప్పర్‌పల్లి కోర్టు ఆదేశాలతో గత బుధవారం రెండు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించిన ఉదయ్ కృష్ణారెడ్డిని గురు, శుక్రవారాల్లో అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారుల పర్యవేక్షణలో విచారించారు. అయితే విచారణకు ఆయన సహకరించలేదని పేర్కొంటూ పోలీసులు మరోసారి కస్టడీ కోరడంతో ఈ కేసు మరో మలుపు తిరిగింది.

ఫీజు బకాయిలపై ఫుల్ ఫైట్

- అర్హులందరికీ పూర్తి ట్యూషన్ ఫీజు విడుదల చేయాల్సిందే
- ఏళ్లుగా రూ.30,40 వేలకే పరిమితం
- మిగతా ఫీజు భారంతో విద్యార్థుల కుటుంబాలు
- ఫీజు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి
- కలెక్టరేట్, ఫీజు పథకం అధికారులతో సమన్వయం చేయాలి
- ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాసి..అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి న్యాయం చేయాలి


STUDENTS PROTECTION FORUM
TELANGANA
BY THE STUDENTS,FOR THE STUDENTS,OF THE STUDENTS

ప్రజా వాయిస్,హైదరాబాద్:అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని విద్యార్థుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఏళ్లుగా కొనసాగుతున్న ఫీజు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ జేఎన్‌టీయూహెచ్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల హైదరాబాద్ ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం సమర్పించింది.

రూ.30–40 వేలతోనే సరి.. మిగతా భారం విద్యార్థులదే

తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి ప్రవేశ పరీక్షలో పదివేల లోపు ర్యాంకు సాధించిన అర్హత కలిగిన వెనుకబడిన తరగతుల విద్యార్థులతో పాటు, నిబంధనల ప్రకారం ర్యాంకుతో సంబంధం లేకుండా ఫీజుకు అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు విడుదల కావాల్సి ఉందని విద్యార్థుల పరిరక్షణ వేదిక పేర్కొంది.అయితే గత కొన్నేళ్లుగా కేవలం రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు మాత్రమే ఫీజు విడుదలవుతుండటంతో మిగతా మొత్తాన్ని విద్యార్థుల కుటుంబాలే భరించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది.

అధికారుల చుట్టూ తిరిగినా.. పరిష్కారం ఎక్కడ.?

ఫీజు సమస్య పరిష్కారం కోసం విద్యార్థులు పలుమార్లు కళాశాల యాజమాన్యాన్ని, జిల్లా కలెక్టరేట్‌ను ఆశ్రయించినా సమస్య కొలిక్కి రాలేదని వేదిక తెలిపింది. ఫీజు పథకం కార్యాలయంతో సమన్వయం చేసుకుని అవసరమైన సాంకేతిక, పరిపాలనా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించినప్పటికీ.. విద్యార్థులు పలుమార్లు కార్యాలయాన్ని సంప్రదించినా స్పష్టమైన పరిష్కారం లభించలేదని పేర్కొంది.ప్రతి విద్యార్థి వ్యక్తిగతంగా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా కళాశాల యాజమాన్యమే బాధ్యత తీసుకోవాలని నాయకులు కోరారు.

ప్రత్యేక కమిటీతో సమస్యకు చెక్ పెట్టాలి

సీనియర్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి జిల్లా కలెక్టరేట్, ఫీజు పథకం కార్యాలయ అధికారులతో సమన్వయం చేయాలని వేదిక డిమాండ్ చేసింది. ఫీజు విడుదలకు అడ్డంకిగా ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కోరింది.అర్హత ఉన్న ఒక్క విద్యార్థి కూడా నష్టపోకుండా పూర్తి ట్యూషన్ ఫీజు విడుదలయ్యేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జేఎన్‌టీయూహెచ్ యాజమాన్యం సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరింది.కార్యక్రమంలో విద్యార్థుల పరిరక్షణ వేదిక నాయకులు రాహుల్ నాయక్, దుర్గాప్రసాద్, ఆదిత్య, అక్షిత, హేమంత్, ఆనంద్, రామకృష్ణ, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో అధికారమే లక్ష్యం, ఎవరితోనూ పొత్తు లేదు

మొదటి పేజీ తరువాయి

రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు.

937 మండలాల్లో పార్టీ విస్తరణ

రాష్ట్రంలో అధికారాన్ని లక్ష్యంగా పెట్టుకుని సమగ్ర రోడ్‌మ్యాప్ సిద్ధం చేస్తున్నామని రాంచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలో కూడా పార్టీ బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీలో చేరేందుకు నేతలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్య

రాష్ట్రంలోని పలువురు కీలక రాజకీయ నేతలు బీజేపీలో చేరేందుకు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారని రాంచందర్ రావు వ్యాఖ్యానించారు. తమ పార్టీలో విభేదాలు లేవని, కేవలం భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి పెరిగిందని, ప్రజా సమస్యలపై సమిష్టిగా పోరాటం చేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారని తెలిపారు.

ప్రతి మూడు నెలలకు రాష్ట్ర పర్యటన

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణకు వచ్చి పార్టీ నాయకులతో సమావేశమై కార్యాచరణను సమీక్షిస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై ఈనెల 13న కీలక సమావేశం

ఉన్నతాధికారులకు కూడా పంపినట్లు తెలిపింది.

నీటి ఖాతాల సమర్పణకు ఆదేశం

ఈ సమావేశంలో 2025–26, 2026–27 నీటి సంవత్సరాలకు సంబంధించిన నీటి వినియోగ ఖాతాలను రెండు రాష్ట్రాలు సమర్పించాలని కేఆర్ఎంబీ కోరింది. నీటి కేటాయింపులు, వినియోగంపై ఈ నివేదికలు కీలకంగా మారనున్నాయి.

కమిటీలో ముగ్గురు సభ్యులు

కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీలో బోర్డు సభ్య కార్యదర్శి సతీష్ కంబోజ్‌తో పాటు తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ రమేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఈఎన్సీ నరసింహమూర్తి సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రెండు తెలుగు రాష్ట్రాల కృష్ణా జలాల వినియోగానికి కీలకంగా మారనున్నాయి.

జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డిపై అత్యాచార కేసు నమోదు

ప్రజా వాయిస్, హైదరాబాద్: జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐ శ్రీనివాసులు రెడ్డిపై అమీన్పూర్ పోలీస్ స్టేషన్‌లో అత్యాచార కేసు నమోదైంది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శ్రీనివాసులు రెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 66(ఈ), 67, 67(ఏ) కింద కేసులు నమోదు చేశారు.

బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసిన అనంతరం పోలీసులు అత్యాచారం, లైంగిక వేధింపులు, బెదిరింపులు, ఇతర నేరాలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు.

సహజీవనం పేరుతో వేధింపుల ఆరోపణలు

సీఐ శ్రీనివాసులు రెడ్డి తనను నమ్మించి సహజీవనం చేశాడని, అనంతరం శారీరకంగా దుర్వినియోగం చేసి బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. తన వ్యక్తిగత వీడియోలు తీసి వాటిని చూపిస్తూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడని కూడా ఆరోపించింది.

విచారణలో బయటపడ్డ అంశాలు

మహిళ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన అధికారులు, కొంతకాలం పాటు శ్రీనివాసులు రెడ్డి బాధితురాలితో ఒకే ఇంట్లో నివసించినట్లు గుర్తించినట్లు సమాచారం. అనంతరం ఆమెను వదిలించుకునేందుకు పలు ప్రయత్నాలు చేసినట్లు విచారణలో తేలినట్లు తెలుస్తోంది.

ఇప్పటికే సస్పెన్షన్

లైంగిక వేధింపుల ఆరోపణలు వెలుగులోకి రావడంతో అప్పటి పోలీసు ఉన్నతాధికారులు సీఐ శ్రీనివాసులు రెడ్డిని ఇప్పటికే సస్పెండ్ చేశారు. తాజాగా అత్యాచార కేసు నమోదవడంతో ఈ వ్యవహారం మరింత కీలక మలుపు తిరిగింది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నేడే పండుగ సాయన్న జయంతి



ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం.పండుగ సాయన్న – తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా వీరుడు. 1850 నుంచి 1900 మధ్య కాలానికి చెందిన ఈయన, మహబూబ్‌నగర్‌కు సమీపంలోని నవాబ్‌పేట మండలం, మెరుగోనిపల్లె గ్రామంలో తల్లి సాయమ్మ, తండ్రి అనంతయ్యలకు జన్మించాడు. వెట్టిచాకిరి, అక్రమ పన్నులతో ప్రజలను పీడించే నిజాం భూస్వామ్య వ్యవస్థను ఎదిరించి, పేదలకు అండగా నిలిచి, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా, ప్రజా వీరుడిగా చరిత్రలో నిలిచిపోయాడు. కేవలం 35–38 ఏళ్ల వయసులోనే కుట్రపూరితంగా చంపబడ్డ ఈయన జీవితంలోని ఈ కోణాన్ని పరిశీలిద్దాం. పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలు ఆనాటి సమాజంలో పెద్ద ఆర్థిక భారంగా ఉండేవి. కట్న కానుకలు, వివాహ ఖర్చులు భరించలేక అనేక మంది తల్లిదండ్రులు తమ కుమార్తెల వివాహాలను వాయిదా వేసుకునేవారు, కొందరు అమ్మాయిలు వివాహం కాకుండానే మిగిలిపోయేవారు. ఈ సమస్యను గుర్తించిన పండుగ సాయన్న, పేద ఆడబిడ్డలకు సామూహిక వివాహాలు జరిపించే బాధ్యతను తానే స్వీకరించాడు. బంగారు పుస్తెల తాళ్ళు, కొత్త బట్టలు, భోజన ఏర్పాట్లు అన్నీ తానే స్వయంగా సమకూర్చేవాడు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, సామాజిక సంస్కరణ కూడా. ఈ సామూహిక వివాహాల్లో కులాంతర వివాహాలను ప్రత్యేకంగా ప్రోత్సహించడం ద్వారా, కులాల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించే ప్రయత్నం చేశాడు. ఈ కార్యక్రమాల వెనుక సాయన్న వ్యక్తిగత జీవితం కూడా ఒక ముఖ్యమైన కోణాన్ని జోడిస్తుంది. ఆయన భార్య నర్సమ్మ, సాయన్న అమరుడైన నాటికి నిండు గర్భవతిగా ఉంది. తన కుటుంబం పట్ల ఆయనకున్న బాధ్యత, ప్రేమ, ఆయన సమాజంలోని ఇతర కుటుంబాల పట్ల చూపిన శ్రద్ధలో కూడా ప్రతిఫలించింది. తన సొంత జీవితంలో కుటుంబ బంధాల విలువను అర్థం చేసుకున్న సాయన్న, పేద కుటుంబాలు తమ ఆడబిడ్డల వివాహాల భారంతో సతమతం కావడాన్ని చూసి చలించిపోయేవాడు. చరిత్రకారుల విశ్లేషణ ప్రకారం, ఈ సామూహిక వివాహాలు కేవలం దానధర్మ కార్యక్రమాలు మాత్రమే కాక, సాయన్న సామాజిక సంస్కరణ దృక్పథానికి నిదర్శనం. కులాంతర వివాహాలను ప్రోత్సహించడం ద్వారా, ఆనాటి కఠినమైన కుల నిబంధనలను సవాలు చేసే ధైర్యం చేశాడు. ఇది ఆధిపత్య వర్గాలకు ససేమిరా నచ్చని విషయం, ఎందుకంటే కుల స్వచ్ఛత అనే భావనను కాపాడుకోవడం వారి అధికార నిర్మాణంలో కీలక భాగం. సాయన్న ఈ సంప్రదాయ నిబంధనలను ధిక్కరించి, ప్రేమ, సమానత్వం ఆధారంగా కొత్త సామాజిక సంబంధాలను నిర్మించే ప్రయత్నం చేశాడు. ఈ కార్యక్రమాల ద్వారా ఆయన కేవలం వ్యక్తిగత దాతృత్వాన్ని ప్రదర్శించలేదు, ఒక కొత్త సామాజిక నమూనాను ఆచరణలో చూపించాడు. నేటికీ కొన్ని ప్రాంతాల్లో సామూహిక వివాహ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు సాయన్న స్ఫూర్తిని ప్రస్తావిస్తారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతి ఆగస్టు 8 నాడు, కొన్ని సంఘాలు సామూహిక వివాహాలు నిర్వహిస్తూ ఆయన సామాజిక సేవా స్ఫూర్తిని కొనసాగిస్తున్నాయి. వర్ధంతి డిసెంబర్ 10 సందర్భంగా జరిగే సభల్లో ఆయన భార్య నర్సమ్మ, కుమార్తె రామమ్మ త్యాగాన్ని కూడా ప్రత్యేకంగా స్మరించుకుంటారు. ఈ కథనాన్ని అందించిన డాక్టర్. వై. శివ ముదిరాజ్, హైద్రాబాదు సెంట్రల్ యూనివర్శిటీ, పండుగ సాయన్న సామాజిక సంస్కరణ కృషిని బహుజన ఉద్యమ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా పేర్కొంటున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం

- ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలి
- మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

పటాన్ చెరువు ప్రజావాయిస్ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు శుక్రవారం నాడు పటాన్‌చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఏం.ఐ.జి కాలనీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (SIR)లో భాగంగా మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు, పార్టీ కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులతో సమావేశమై ఇప్పటికే నింపిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత BLO మరియు BLAలతో తప్పనిసరిగా క్రాస్ చెక్ చేసి, ఆగస్టు 10వ తేదీలోపు తిరిగి అందజేయాలని సూచించారు. ఆగస్టు 10వ తేదీ చివరి గడువు కావడంతో ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ప్రక్రియను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఓల్డ్ ఏం.ఐ.జి బీ పార్క్‌లో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. ఈ కమ్యూనిటీ హాల్‌కు సింధు ఆదర్శ్ రెడ్డి కార్పొరేటర్‌గా ఉన్న సమయంలోనే మంజూరు చేయించగా, ప్రస్తుతం పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వాటి పురోగతిని పరిశీలించి, నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరిత గతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో రాణి యాదవ్, విజయలక్ష్మి, గాయత్రి, అరుణ, జ్యోతి, శ్రీనివాస్, వినోద, జెబున్, తులసి, అఖిల, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి పీహెచ్‌సీలో అత్యవసర వైద్యం కరువు

- ప్రమాద బాధితులకు ఫస్ట్ ఎయిడ్ కూడా కష్టమేనా?
- ప్రాథమిక వైద్య సామగ్రి కొరతపై తీవ్ర ఆందోళన

ప్రజా వాయిస్ , మఠంపల్లి, ఆగష్టు 7సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో అత్యవసర వైద్య సేవల పరిస్థితి దయనీయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. అత్యవసర సమయంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వ వైద్య కేంద్రంలోనే కనీస వైద్య సదుపాయాలు, ప్రాథమిక వైద్య సామగ్రి అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది.మండలంలో రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర ఘటనలు చోటుచేసుకున్నప్పుడు గాయపడిన వారిని తొలుత మఠంపల్లి పీహెచ్‌సీకే తీసుకువస్తుంటారు. అయితే ప్రమాద బాధితులకు తక్షణం అందించాల్సిన ఫస్ట్ ఎయిడ్‌కు అవసరమైన ప్రాథమిక వైద్య సామగ్రి కూడా అందుబాటులో లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో పీహెచ్‌సీకి వచ్చే బాధితుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు.

ప్రాణాపాయంలో 'ప్రాథమిక చికిత్స'కూ ఇబ్బందేనా?

ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి తొలి కొన్ని నిమిషాల్లో అందే వైద్యం అత్యంత కీలకం. రక్తస్రావాన్ని నియంత్రించడం, గాయాలను శుభ్రపరచి డ్రెస్సింగ్ చేయడం, అవసరమైన అత్యవసర మందులు ఇవ్వడం వంటి ప్రాథమిక చికిత్స అందకపోతే పరిస్థితి విషమించే అవకాశం ఉంటుంది.ఇలాంటి కీలక సమయంలో పీహెచ్‌సీలో అవసరమైన సామగ్రి కొరత ఉందనే విషయం నిజమైతే, అది సాధారణ సమస్యగా చూడలేమని ప్రజలు అంటున్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడిన అత్యవసర వైద్య విభాగంలో కనీస సదుపాయాల కొరత ఎలా కొనసాగుతోంది? వైద్యశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారు. దూర ప్రాంతాలకు పరుగులుపీహెచ్‌సీలో తక్షణ చికిత్స అందకపోతే ప్రమాద బాధితులను మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించాల్సి వస్తుంది. రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలైన వారికి ప్రతి నిమిషం విలువైన సమయంలో రవాణా ఆలస్యం అదనపు ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని పలు గ్రామాలకు కీలకమైన ప్రభుత్వ వైద్య కేంద్రంగా ఉన్న పీహెచ్‌సీలో అత్యవసర సేవలు పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.అధికారులు స్పందించాలిపీహెచ్‌సీలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యవసర వైద్య సామగ్రి, మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, డ్రెస్సింగ్ సామగ్రి, ఇతర అవసరమైన పరికరాలపై సంబంధిత అధికారులు తక్షణం సమీక్ష నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అత్యవసర సేవల్లో లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్ది, అవసరమైన సామగ్రిని సమకూర్చడంతో పాటు నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలోనే అత్యవసర సమయంలో కనీస వైద్యం అందకపోవడం నిజమైతే.. ఇది చిన్న లోపం కాదు, ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దీనిపై తక్షణమే స్పందించి వాస్తవ పరిస్థితిని వెల్లడించి, అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చికెన్ కర్రీలో బొద్దింక ప్రత్యక్షం

- హుస్నాబాద్ దాబా కల్తీ లీలలు, నిర్వాహకుల బరితెగింపు!
- విషపూరితమైన చికెన్ కర్రీ
- దాబాలో తీవ్ర కలకలం





ప్రజా వాయిస్ హుస్నాబాద్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్) సమీపంలోని 'రాఘవేంద్ర దాబా' ఆహార ప్రియుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. దండేపల్లి గ్రామానికి చెందిన వంగ నవీన్ తన మిత్రుడితో కలిసి భోజనం కోసం ఈ దాబాకు వెళ్లి చికెన్ కర్రీ ఆర్డర్ 7చేయగా, అందులో ఏకంగా చనిపోయిన బొద్దింక తేలడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. పరిశుభ్రతను పూర్తిగా పక్కన పెట్టి అపరిశుభ్ర వాతావరణంలో వంటకాలు తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. శుక్రవారం నాడు మీడియాకు తన గోడు వెళ్ళబోసుకున్నాడు

తప్పు ఒప్పుకోకపోగా దాదాగిరీ:

బిల్లు వసూలు చేసి పంపేసిన యజమాని కూరలో బొద్దింక వచ్చిన విషయాన్ని ప్రశ్నించిన వినియోగదారులపై దాబా యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా ప్రవర్తించింది. కనీస పశ్చాత్తాపం చూపించకపోగా, దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తూ ఆ కల్తీ భోజనానికి సంబంధించిన పూర్తి బిల్లును బలవంతంగా వసూలు చేసి వారిని అక్కడి నుంచి పంపించివేశారు. యజమాని ప్రవర్తనపై బాధితులతో పాటు స్థానికులు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రంగంలోకి ఫుడ్ సేఫ్టీ అధికారులు: త్వరలోనే కఠిన తనిఖీలు

ఈ అక్రమంపై బాధితుడు నవీన్ వెంటనే స్పందించి సిద్దిపేట జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ జయరాంకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. సంఘటనకు సంబంధించిన ఫోటోలు, దాబా బిల్లును ఆధారాలుగా పంపించారు. దీనిపై స్పందించిన ఫుడ్ ఇన్స్పెక్టర్, సిబ్బంది కొరత మరియు ముందస్తు షెడ్యూల్స్ కారణంగా త్వరలోనే సదరు దాబాపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

కన్స్యూమర్ కోర్టుకు వెళ్తాం: బాధితుల హెచ్చరిక

ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ కల్తీ ఆహారాన్ని విక్రయిస్తున్న ఇటువంటి దాబాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే సీజ్ వేటు వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ నిర్లక్ష్య వైఖరిపై కన్స్యూమర్ ఫోరమ్ (వినియోగదారుల కోర్టు)ను ఆశ్రయించి చట్టబద్ధంగా బుద్ధి చెబుతామని బాధితులు స్పష్టం చేశారు.

అనుమతి రెండంతస్తులకు నిర్మాణాలు మాత్రం ఆరంతస్తులు

- భవనాలను సీజ్ చేసిన కొనసాగుతున్న పనులు
- అధికారుల మౌనం ఎందుకు
- రాజకీయ నాయకుల అండతోనే నిర్మాణాల?
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారం
- చర్యలు తీసుకోవాలంటూ స్థానికుల డిమాండ్

పటాన్ చెరువు ప్రజావాయిస్ పటాన్ చెరువు నియోజకవర్గంలోని అమీన్పూర్ ఇంద్రేశం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న ఘనాపూర్ వెలిమల తదితర ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అనుమతులకు మించి భారీ భవనాలను నిర్మించిన కొందరి బడా బాబులకు నోటీసులు ఇచ్చిన భవనాలను సీజ్ చేసిన గాని అవేమీ లెక్క చేయకుండా ఇష్టానుసారంగా చేపడుతున్న భారీ భవన నిర్మాణాలకు జి ప్లస్ టు అనుమతులు ఇచ్చిన కొందరు బడా బాబులు అవేమీ పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు అనుమతులకు మించి భారీ బహుళ అంతస్తుల నిర్మాణంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొడుతున్న కొందరు అక్రమ భవన నిర్మాణదారులు అమీన్పూర్ ఇంద్రేశం కిష్టారెడ్డిపేట్ ఘనపూర్ తదితరప్రాంతాల్లో ప్రాంతంలో భారీగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులకు మించి భారీ భవన నిర్మాణాలు జరుగుతున్న పనులు కొనసాగిస్తున్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తుంది జి ప్లస్ టు పర్మిషన్లు ఉన్నప్పటికీ పైన భారీ అంతస్తులతో ఎలాంటి అనుమతులు లేకుండా కొన్నిచోట్ల కొందరు అనుమతి తీసుకున్న నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్న అటువైపు కనీసం కన్నెత్తి చూడని అధికారులు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని స్థానికులు వాపోయారు ఐదు నుంచి ఆరు అంతస్తుల వరకు పూర్తిస్థాయి అనుమతులు లేకుండానే భవన నిర్మాణాలు చేపడుతున్నారని దీనివల్ల పరిసర భవనాల భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహించి వెళ్లిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు పన్నులు తప్పించుకునేందుకు కొంతమంది బిల్డర్లు తాము ఆడిందే ఆట పాడింది పాటగా దర్జాగా అక్రమ మార్గాలు అనుసరిస్తున్నప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం హెచ్ ఎం డి ఏ మున్సిపల్ అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపటాల్సి ఉన్నప్పటికీ అదనపు పన్నులు తప్పించుకునేందుకు కొందరు బిల్డర్లు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి దీనికి స్థానికంగా పూర్తి స్థాయిలో పూర్తి సహకారం ఉందనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి అక్రమ నిర్మాణాల కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయ నష్టం కలుగుతోందని భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు డ్రైనేజీ ఇబ్బందులు ప్రజా భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసిన అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదని ఇప్పటికైనా ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమ నిర్మాణాలపై స్థానిక ఎమ్మార్వో గాని టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోవడంలేదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాద భరితంగా వనపర్తి తిరుమలయ్య గుట్ట రోడ్డు

- వెంటనే రిపేరు చేయించాలి
- ఎమ్మెల్యే మెగా రెడ్డికి ఐక్య వేదిక నాయకులు, భక్తులు వినతి
- లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం
- డా" సతీష్ యాదవ్.

ప్రజా. వాయిస్,వనపర్తి.గురువారం ఏడవ తారీకు యధావిధిగా భక్తులు ఏడుకొండలు ఎక్కి తిరుమలను స్వామిని దర్శించుకున్న తరువాత. అఖిల పక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా"సతీష్ యాదవ్ కు భక్తులంతా రోడ్డు గురించి విన్నవించుకుంటే, మీ తరపున ఎమ్మెల్యే మెగా రెడ్డికి విజ్ఞప్తి చేస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, వచ్చేది శ్రావణమాసం ఈ మాసంలో దాదాపు 5 శనివారాలలో వేలాదిగా వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని, వారికి ప్రమాదాలు జరగకుండా.. పాడైపోయిన రోడ్డును వెంటనే వేయించాలని వనపర్తి ఎమ్మెల్యేను,మరియు ఎంపీని కోరారు.ఎందుకంటే చుట్టుపక్కల గ్రామాల్లో ఉండే ప్రజలు మరియు వనపర్తి పట్టణ ప్రజలు ఆటోలలో, కార్లలో, ట్రాక్టర్ లలో, మరియు బైక్ లపై తిరుమల గుట్టకు వస్తారు. కానీ రోడ్డు మొత్తం పాడై గుంతలు ఏర్పడి ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉంది కనుక వెంటనే రిపేర్ చేయిస్తూనే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని లేకుంటే ఏదైనా ప్రమాదాలు జరిగి అసౌకర్యం కలిగిస్తాయని, వెంటనే రోడ్డు రిపేరు చేయాలని ముక్తకంఠంతో అందరు కోరినట్లు డాక్టర్ సతీష్ యాదవ్ తెలిపారు .ఈ కార్యక్రమంలో టెంపుల్ కమిటీ సభ్యులు తిరుమలయ్య గుట్టకు వచ్చే భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ పెండింగ్ వివరాలు వెంటనే వెల్లడించాలి

- రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కిసాన్ మోర్చా వినతిపత్రం



ములుగు, ఆగస్టు 7 (ప్రజా వాయిస్): తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన సేకరణ బియ్యం (సీఎంఆర్)ను భారత ఆహార సంస్థకు సరఫరా చేసే ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పూర్తి వివరాలను వెంటనే వెల్లడించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జాడి రామరాజు నాయకత్వంలో పరిపాలన అధికారి రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ..... రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి సంబంధించిన సేకరణ బియ్యం సరఫరాలో నెలకొన్న పెండింగ్ వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని కోరారు. రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా, ధాన్యం సేకరణ నుంచి సరఫరా వరకు ప్రతి దశలో పారదర్శకత ఉండాలని సూచించారు.జిల్లా మాజీ అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.....రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి, పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జాడి రామరాజు మాట్లాడుతూ..... సేకరణ బియ్యం సరఫరా వ్యవహారానికి సంబంధించిన అన్ని వివరాలను ప్రజల ముందుంచి రైతుల అనుమానాలకు తెరదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్యా జహర్‌లాల్, జిల్లా ఉపాధ్యక్షుడు జినుకూల కృష్ణాకర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీలమంతుల రవీంద్రచారి, నగరపు రమేష్, గిరిజన మోర్చా అధ్యక్షుడు సిద్ధబోయిన సురేందర్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గుగులోత్ స్వామి నాయక్, మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, పట్టణ అధ్యక్షుడు రాఖేష్ యాదవ్, తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, ఓబీసీ ఉపాధ్యక్షుడు గద్దం శ్రీధర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గద్దల హరిబాబు, మండల ఉపాధ్యక్షుడు దుర్గం దుర్గారావు, కిసాన్ మోర్చా నాయకులు ఇర్సవడ్ల జగన్, వార్దెల్లి వెంకన్న, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి కొండగొర్ల రాంబాబు, సామాజిక మాధ్యమాల కన్వీనర్ దుర్గం శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వరుస 'ఫోర్జరీ' సంతకాల కలకలం!.

- ఉప సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసిన సర్పంచ్ భర్త.!

ప్రజా వాయిస్ మహబూబాబాద్ జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల పెత్తనం మితిమీరిపోవడమే కాకుండా, ఏకంగా ఫోర్జరీ సంతకాలకు ఒడిగడుతుండటం స్థానికంగా కలకలం రేపుతోంది. మొన్నడోర్నకల్ పరిధిలోని గిరిపురం పంచాయతీనిధుల దుర్వినియోగం, నిన్న .గూడూరు మండలం గుండెంగ లో సర్పంచ్ కుమారుడి ఫోర్జరీ సంతకాల ఉదంతాలు మరువకముందే.. తాజాగా .కొత్తగూడ మండలం రామన్నగూడెం గ్రామపంచాయతీలో మరో ఫోర్జరీ వ్యవహారం వెలుగు చూసింది.రామన్నగూడెం పంచాయతీకి సంబంధించిన ఒక ముఖ్యమైన రికార్డుపై ఉప సర్పంచ్‌కు తెలియకుండానే, ఆయన సంతకాన్ని సర్పంచ్ భర్త ఫోర్జరీ చేసి అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది. పరిశీలన సమయంలో అధికారులకు అనుమానం రావడంతో ఈ ఉదంతం బయటపడింది. విషయం తెలుసుకున్న ఉప సర్పంచ్ అధికారులను నిలదీయడంతో సర్పంచ్ భర్త వెనక్కి తగ్గక తప్పలేదు. అనంతరం కొత్తగూడ ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల సమక్షంలోనే ఉప సర్పంచ్‌చేత మళ్లీ అసలైన సంతకాలు చేయించడం చర్చనీయాంశంగా మారింది.

గంజాయిపై రోలెక్స్ నజర్

- అనంతగిరిలో నార్కోటిక్ డాగ్‌తో జల్లెడ
- హోటళ్లు,టీ దుకాణాలు,మెడికల్ షాపుల్లో విస్తృత తనిఖీలు
- గొండ్రియల పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై ఎస్సై ఏడుకొండలు అవగాహన

ప్రజా వాయిస్,అనంతగిరి: గంజాయి, ఇతర మాదకద్రవ్యాలపై పోలీసులు నిఘా మరింత పెంచారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు అనంతగిరి ఎస్సై ఏడుకొండలు ఆధ్వర్యంలో డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది శుక్రవారం మండల కేంద్రంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో హోటళ్లు,టీ దుకాణాలు, మెడికల్ షాపులు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

యువతను గంజాయి, ఇతర మాదకద్రవ్యాల బారినుంచి కాపాడటమే లక్ష్యంగా తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు. గంజాయి వినియోగం, సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. మత్తు పదార్థాలను వినియోగించే వారితో పాటు వాటిని సరఫరా చేసే వ్యక్తుల వివరాలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులకు ఎస్సై ఏడుకొండలు అవగాహన

మండలంలోని గొండ్రియల పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ఎస్సై ఏడుకొండలు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. తోటి విద్యార్థులు ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల బారిన పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై ఏడుకొండలు సూచించారు.

సమాచారం ఇవ్వండి

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు, సరఫరాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఏడుకొండలు సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు లేదా సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సోమశిలలో టూరిజం ఉద్యోగులపై దాడి

- ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు
- బాధిత ఉద్యోగుల వైద్య ఖర్చులు పూర్తిగా టూరిజం కార్పొరేషన్ భరిస్తుంది.
- టూరిజం కార్పొరేషన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ రవీందర్

ప్రజా వాయిస్.. నాగర్ కర్నూల్.నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల క్షేత్రంలో గురువారం తెల్లవారుజామున పర్యాటక శాఖ ఉద్యోగులపై జరిగిన దాడి ఘటనాస్థలాన్ని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు టూరిజం కార్పొరేషన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ రవీందర్ నాయక్, విజిలెన్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సమ్మయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ సోమశిలలోని బోటింగ్ పరిశీలించారు.ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేలా బోటింగ్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.పర్యాటకులు, టూరిజం సిబ్బంది భద్రతకు అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.దాడిలో గాయపడిన పర్యాటక శాఖ ఉద్యోగులు దేవరాజు, శివలకు అవసరమైన వైద్యం అందించడంతో పాటు వారి పూర్తి వైద్య చికిత్స ఖర్చులను తెలంగాణ టూరిజం కార్పొరేషన్ భరిస్తుందని అధికారులు భరోసా ఇచ్చారు.ఉద్యోగులపై దాడికి పాల్పడిన ఐదుగురు వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు.ఈ పరిశీలన కార్యక్రమంలో టూరిస్ట్ పోలీసులు ఎం. శివశంకర్, ఎస్. శివశంకర్, శివప్రసాద్, బోటింగ్ యూనిట్ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్, చిన్న, పుట్టపాగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏదులాపురంలో మంత్రి పొంగులేటి మార్నింగ్ వాక్

- ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చి దిద్దుతా!
- మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.100 కోట్ల నిధులు మంజూరు
- త్రాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు క్షేత్రస్థాయిలో పర్యటన

ప్రజా వాయిస్ ఖమ్మం: ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, సత్యనారాయణపురం, ఇందిరమ్మ కాలనీలలో జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్‌తో కలిసి కాలినడకన కాలనీల్లో తిరుగుతూ పలు అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పరిస్థితులు, ప్రజా మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను విలీనం చేసి ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేశారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేందుకే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని పేర్కొన్నారు.సాయిగణేష్ నగర్ లో ఉన్న టీ స్టాల్ లో కూర్చుని టీ త్రాగి అనంతరం ఇందిరమ్మ కాలనీలో పర్యటించారు. వర్షం పడుతున్న కాలి నడకన గొడుగు చేత పట్టుకుని తిరిగి పరిసరాలను పరిశీలిస్తూ కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. వెంకట్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో అత్యాధునిక డంప్‌యార్డ్

- పారిశుధ్య విప్లవానికి శ్రీకారం
- ఆధునీకరణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- డంప్‌యార్డ్‌ను పరిశీలించిన చైర్మన్ చిలుకూరి సుధా-బాలకృష్ణ, కమిషనర్ శ్రీజా రెడ్డి

మిర్యాలగూడ, ప్రజా వాయిస్.పట్టణ పారిశుధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసి, వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో చేపట్టేందుకు మిర్యాలగూడ మున్సిపాలిటీ చర్యలు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా–బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డి, సంబంధిత వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తో కలిసి శుక్రవారం స్థానిక డంప్‌యార్డ్‌ను పరిశీలించారు.ఇటీవల డంప్‌యార్డ్‌కు చేరిన అత్యాధునిక యంత్రాల పనితీరును పరిశీలించిన అధికారులు, అవి మరో నెల రోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. యంత్రాలు పనిచేయడం ప్రారంభించిన తర్వాత ఘన వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో ప్రాసెస్ చేయడంతో పాటు చెత్త నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని వెల్లడించారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీజా రెడ్డి మాట్లాడుతూ, డంప్‌యార్డ్‌ను పూర్తిస్థాయిలో ఆధునీకరించి, దీర్ఘకాలిక ప్రణాళికతో నిర్వహిస్తామని తెలిపారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణ పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు.మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా–బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ఆధునిక సాంకేతికతతో డంప్‌యార్డ్‌ను అభివృద్ధి చేసి మిర్యాలగూడను స్వచ్ఛమైన పట్టణంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

చేనేత కళకు ఘన సత్కారం

- ప్రతిభావంతులైన కార్మికులకు జనగామ కలెక్టర్ కార్యాలయంలో సన్మానం
- జనగామ జిల్లా ఏ . డి బాబు

ప్రజా వాయిస్/కొడకండ్ల చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది.. నేతన్నల సేవలు అభినందనీయం.జనగామ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చేనేత రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా వృత్తిలో నైపుణ్యం ఉన్న వారిని సన్మానించింది ఎన్నికైన నూతన సొసైటీ అధ్యక్షులను సన్మానించింది కొడకండ్ల గ్రామానికి చెందిన దుస్స సోమయ్య దోర్నాల నరహరి మరియు కొడకండ్ల సొసైటీ అధ్యక్షులు పసునూరి మధుసూదన్ జనగామ జిల్లా ఏ డి బాబు చేతుల మీదుగా మెమొంటో అందించి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా టిఫ్ట్ ఫండ్ కట్టి అనారోగ్య కారణాల వలన మరణించిన మధ్య లక్ష్మయ్య ఇన్సూరెన్స్ ఐదు లక్షల చెక్కు వారి నామిని భార్య అయిన మద్దె కనకమ్మకు ఇవ్వడం జరిగింది. చేనేత రంగ పరిరక్షణతో పాటు సంప్రదాయ కళను భావితరాలకు అందించడంలో నేతన్నలు చేస్తున్న కృషిని అధికారులు కొనియాడారు.ఈ సందర్భంగా చేనేత కార్మికుల నైపుణ్యం, కష్టపడి పనిచేసే తత్వం, సంప్రదాయ చేనేత కళను కాపాడుతున్న తీరును ప్రశంసించారు. చేనేత రంగానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు.చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలు, ఆధునిక సాంకేతికత, మెరుగైన డిజైన్లతో పాటు నేతన్నలకు అవసరమైన సహకారం అందిస్తే చేనేత రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.అనంతరం ప్రతిభ కనబరిచిన చేనేత కార్మికులను శాలువాలు, జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు పసునూరి నవీన్ కుమార్ సెక్రెటరీ పసునూరు సురేష్ డైరెక్టర్ మధురం సుభాష్ దేవస్థానం శ్రీనివాస్ మరియు అధికారులు, చేనేత శాఖ సిబ్బంది, చేనేత కార్మికులు, సంబంధిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూమి కోల్పోయిన బొజ్జమ్మకు న్యాయం జరగాలి

- వెల్జాల్ గ్రామంలో ఓ వృద్ధురాలిని నమ్మించి మోసం చేసిన మనవడి భార్య
- మతిస్థిమితం లేని వ్యక్తుల పొలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తుందని వృద్ధురాలు ఆవేదన
- తనకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నాం

ప్రజా వాయిస్ తలకొండపల్లి :కంటికి రెప్పలా చూసుకుంటారని నమ్మితే.. నట్టేట ముంచారు!వృద్ధాప్యంలో అండగా ఉంటారనుకుంటే..ఆస్తిని కాజేసి అన్యాయం చేశారు! కన్నకూతురు,మనవళ్లు, మనవరాళ్లకు సమానంగా చెందాలని రాసిచ్చిన గిఫ్ట్ డీడ్ భూమిని, ఓ మనవడి భార్య గుట్టుచప్పుడు కాకుండా తన పేరిట మార్చేసుకున్న ఉదంతం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన ఆయిల్ బుజ్జమ్మ నమ్మించి కుటుంబ సభ్యులే మోసం చేశారని తనను రోడ్డుపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేసింది!వెల్జాల్ గ్రామానికి చెందిన ఆయిల్ బొజ్జమ్మ, భర్త వెంకటయ్యల పెద్ద కుమార్తె కలమ్మ కొంతకాలం క్రితం అనారోగ్యంతో మరణించింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు (నలుగురు సంతానం) ఉన్నారు. తల్లిలేని ఆ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అలాగే తన చిన్న కుమార్తె నాగమణి, మనవరాళ్లు పద్మ, రజిత, మనవళ్లు శేఖర్, రవిలు వృద్ధాప్యంలో తనను బాగా చూసుకుంటారని బొజ్జమ్మ నమ్మింది. ఆ నమ్మకంతోనే తన పేరుపై ఉన్న సర్వే నంబర్ 54 లోని 8 ఎకరాల పట్టా భూమిని వారందరికీ గిఫ్ట్ డీడ్ ద్వారా రాసిచ్చింది.తెలియకుండా రిజిస్ట్రేషన్..విక్రయాలు!అయితే, బొజ్జమ్మ నమ్మకాన్ని చిన్న మనవడు రవి భార్య సునీత వమ్ము చేసింది. వృద్ధురాలికి తెలియకుండానే ఆ 8 ఎకరాల భూమిని పూర్తిగా తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుంది.అంతటితో ఆగకుండా అందులో కొంత భూమిని అప్పటికే విక్రయించేసింది.అంతేకాకుండా, పెద్ద మనవడు శేఖర్ పేరుపై ఉండాల్సిన భూమిని కూడా తన పేరిట మార్చుకుని, విక్రయించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని బాధితురాలు ఆరోపించింది.అధికారులు స్పందించి న్యాయం చేయాలి!తన ఆస్తి తన పిల్లలందరికీ సమానంగా దక్కాలనే ఉద్దేశంతోనే ఇచ్చానని, కానీ ఇలా మోసపూరితంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడం అన్యాయమని బొజ్జమ్మ కన్నీరుమున్నీరైంది. తన కుమార్తె నాగమణి, మనవరాళ్లు పద్మ, రజితలకు ఈ భూమిలో సమాన హక్కులు, భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేస్తోంది. తన అనుమతి లేకుండా అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్లు, విక్రయాలపై ఉన్నతాధికారులు చట్టపరంగా సమగ్ర విచారణ జరపాలని వేడుకుంటోంది. తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుని, తన భూమిని తనకు లేదా తన చట్టబద్ధమైన వారసులకు అప్పగించి న్యాయం చేయాలని అధికారులను కోరుతోంది.

సిరులు కురిపిస్తున్న ఆయిల్ పామ్

- మొదలైన గెలల సేకరణ
- నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు జమ
- మధ్యవర్తుల బెడద లేదు
- లాభదాయకమైన సాగు
- తోటలను సందర్శించిన ఉద్యాన అధికారి అన్వేష్

ప్రజా వాయిస్, కోరుట్ల: కోరుట్ల మండలంలో ఆయిల్ పామ్ సాగు ఆశించిన ఫలితాలను ఇస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొదటిసారిగా సాగు చేపట్టిన రైతుల తోటల్లో గెలల దిగుబడి ప్రారంభమైంది. శుక్రవారం మండలంలోని ఆయిల్ పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని మండల ఉద్యాన విస్తీర్ణ అధికారి అన్వేష్ సందర్శించారు. గెలల నాణ్యతను పరిశీలించి, కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి మాట్లాడుతూ.. మొదట్లో ఆయిల్ పామ్ సాగుపై రైతుల్లో అనేక సందేహాలు ఉండేవని, కానీ నేడు దిగుబడులు ప్రారంభమై లాభాలు వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం కంపెనీలే నేరుగా కొనుగోలు చేస్తున్నాయనిపేర్కొన్నారు. ఎటువంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నగదు నేరుగా రైతుల బ్యాంకుఖాతాల్లోనే జమ అవుతుండటం విశేషమన్నారు.ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే కొత్త రైతులు, ఇప్పటికే దిగుబడి పొందుతున్న తోటలను సందర్శించి అవగాహన పెంచుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోహియా ఫీల్డ్ ఆఫీసర్ హరికృష్ణ, రైతులు అడువల మల్లేశం, చందరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యే విజయానికి పునాది.. విద్యార్థులే దేశ భవిష్యత్తు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ
- కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి.
- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ,ప్రజా వాయిస్.విద్యార్థులే దేశ భవిష్యత్తని, విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే, వారి విద్యాభ్యాసంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం మాట్లాడుతూ విద్యే వ్యక్తి భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప ఆయుధమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా బధిర, దృష్టిలోపం విద్యార్థులకు డిగ్రీ చదువు

- 5% ఉద్యోగ రిజర్వేషన్ ఉన్నా.. చదివే అవకాశాలు లేక భవిష్యత్‌పై ఆందోళన
- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సెక్షన్లు, హాస్టల్ వసతులు కల్పించాలని విద్యార్థులు, అధ్యాపకుల డిమాండ్
- గత ప్రభుత్వం పట్టించుకోలేదు.. ఈ ప్రజా ప్రభుత్వం అయినా పట్టించుకోవాలి.
- ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతి
- బీ.సీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం.

మిర్యాలగూడ, ప్రజా వాయిస్: తెలంగాణలో బధిర (చెవిటి, మూగ), దృష్టిలోపం విద్యార్థులకు ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని బీ.సీ. చైతన్య విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం అన్నారు. మిర్యాలగూడలోని బధిరుల జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన, అనంతరం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి బధిర విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి 2026–27 విద్యా సంవత్సరం నుంచి బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), ఏఐ సర్టిఫికేషన్ కోర్సులను ప్రారంభిస్తోందని గుర్తు చేశారు. అయితే తెలంగాణలో సాధారణ విద్యార్థుల కోసం వందలాది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నప్పటికీ, సైన్ లాంగ్వేజ్ ద్వారా బోధించే ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక్కటి కూడా లేకపోవడం బాధాకరమన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2010–11లో జీఓ–212 ద్వారా కడప, ఏలూరు, మిర్యాలగూడలో బధిర విద్యార్థుల కోసం అదనపు సెక్షన్లు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఇంటర్మీడియట్ వరకు చదివిన తర్వాత ప్రత్యేక డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో చాలామంది విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ, ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలే లేకపోతే ఆ ఉద్యోగాలకు ఎలా అర్హత సాధిస్తారని ప్రశ్నించారు.స్పెషల్ ఎడ్యుకేషన్ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. రామకృష్ణ నల్లగంటి మాట్లాడుతూ, బధిర, దృష్టిలోపం విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక సెక్షన్లు ఏర్పాటు చేయడంతో పాటు హాస్టల్ వసతులు కల్పించాలని కోరారు. దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.హెచ్‌ఈసీ రెండో సంవత్సరం విద్యార్థిని వరలక్ష్మి మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత డిగ్రీ చదవాలంటే ప్రైవేటు కళాశాలల్లోనే చేరాల్సి వస్తోందని, అధిక ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు చదువును మధ్యలోనే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రత్యేక డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని కోరింది.జూనియర్ లెక్చరర్ ఈ. మధుకర్ మాట్లాడుతూ, బధిర విద్యార్థుల కోసం రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో పూర్తిస్థాయి వసతులతో ప్రత్యేక జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తే విద్యార్థులపై దూరభారం తగ్గడంతో పాటు మరింత మంది ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి సమర్పించిన వినతిపత్రంలో, తెలంగాణలో బధిర, దృష్టిలోపం విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో అదనపు సెక్షన్లు, సైన్ లాంగ్వేజ్ బోధన, హాస్టల్ సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు.

ఢిల్లీ నుంచి నల్లగొండ వరకు చోరీల పరంపర

- అంతర్రాష్ట్ర నేరస్థుడు అరెస్ట్
- పగటి పూట తాళం వేసిన ఇళ్లు, అపార్ట్ మెంట్ లే లక్ష్యం
- రూ.3.25 లక్షల నగదు, స్కూటీ, చోరీ పరికరాల స్వాధీనం
- మరో ఇద్దరు నిందితుల కోసం రాష్ట్రాల మధ్య ప్రత్యేక గాలింపు
- వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పీ. జి.రమేష్.

ప్రజా వాయిస్, నల్లగొండ: నల్లగొండ పట్టణంలో ఇటీవల వరుసగా చోటుచేసుకున్న పగటి పూట చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. పగటి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ (48)ను నల్లగొండ సబ్ డివిజన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.3.25 లక్షల నగదు, స్కూటీ, చోరీలకు ఉపయోగించిన రెండు ఇనుప రాడ్లు, మాస్క్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు ఇర్షాద్, షరీఫ్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు రాష్ట్రాల మధ్య సమన్వయంతో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ వివరాలను అడిషనల్ ఎస్పీ జి. రమేష్ శుక్రవారం వెల్లడించారు.జూలై 26న నల్లగొండ పట్టణంలోని వి.టి. కాలనీలో ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు వన్‌టౌన్, టూ టౌన్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషిస్తూ నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా ఆగస్టు 6న సాయంత్రం పానగల్ బైపాస్ రోడ్డుపై మరోసారి చోరీలకు పాల్పడేందుకు స్కూటీపై వస్తున్న మహమ్మద్ నసీమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నల్లగొండ వన్‌టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వేదాయపాలెం, తిరుపతి జిల్లా తిరుచానూరు ప్రాంతాల్లో నమోదైన పలు చోరీ కేసుల్లో తన ప్రమేయాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.విచారణలో ఈ ముఠా ముందుగా తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి కొంతసేపు రెక్కీ నిర్వహించేదని, ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదు అపహరించి వెంటనే పరారయ్యేదని వెల్లడైంది. నల్లగొండలో జరిగిన చోరీల్లో ఈ ముఠా ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు, మరో అపార్ట్‌మెంట్‌లో మూడు తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.అలాగే నెల్లూరు జిల్లాలో 24 తులాల బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలు, తిరుచానూరులో తొమ్మిది తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు చోరీ చేసిన కేసుల్లో కూడా ఇదే ముఠా ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ ఢిల్లీ, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ ప్రాంతాల్లో పలు చోరీ కేసుల్లో అరెస్టై జైలు శిక్ష అనుభవించిన పాత నేరస్థుడని పోలీసులు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు వచ్చి రాయదుర్గం, ఉప్పల్, మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడి చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించిన తర్వాత మూడు నెలల క్రితం అత్తాపూర్‌లో అద్దెకు ఉంటూ తిరిగి నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేసి రూ.3.25 లక్షల నగదు రికవరీ చేయడంతో పాటు కేసును ఛేదించిన నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ఏ. రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ కె. ఆది రెడ్డి, ఎస్ఐలు సైదబాబు, ముత్తయ్యతో పాటు దర్యాప్తు బృందంలోని పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.

నాలుగేళ్లుగా నిల్వ నీరు

- అధికారుల నిర్లక్ష్యానికి బీసీ కాలనీ బలి!
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- దోమల విజృంభణతో డెంగ్యూ, మలేరియా భయాందోళనలో కాలనీవాసులు

ప్రజా వాయిస్ మహాదేవపూర్ ప్రతినిధి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామంలోని కొత్త బెగ్లూర్ బీసీ కాలనీలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ప్రతి వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి చిన్న చెరువును తలపిస్తున్నా, సమస్య పరిష్కారానికి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.నీలారపు వెంకటయ్య, ఆశా మహేష్ ఇళ్ల సమీపంలోని ఈ స్థలంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి కాలనీవాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గత నాలుగేళ్లుగా ఈ సమస్యను గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని, ఇటీవల ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత శాఖల నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని స్థానికులు వాపోయారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన సమస్యపై అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు.వర్షపు నీటి నిల్వ కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే నీటి నిల్వను తొలగించి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామపంచాయతీ, మండల, జిల్లా అధికారులను ఆశా మహేష్, నీలారపు వెంకటయ్యతో పాటు కాలనీవాసులు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య, విద్య, తాగునీరు, సంక్షేమ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రజా వాయిస్,సంగారెడ్డి : జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలతో పాటు విద్య, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమం తదితర రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, వాటి ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యం, విద్య, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం, రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ శాఖలకు సంబంధించి జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, వాటి పురోగతి, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, తదితర అంశాలపై శాఖల వారీగా మంత్రి సమగ్రంగా సమీక్షించారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి చేపడుతున్న చర్యలపై మంత్రి సమీక్షించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన డ్యూటీ డాక్టర్ స్థానంలో మరో నకిలీ వ్యక్తి డాక్టర్‌గా విధులు నిర్వహించిన ఘటనపై మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో వైద్యుల హాజరు, విధుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డి సి హెచ్ ఎస్ , ఆసుపత్రి సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. కంకోల్, సింగితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని, బర్దిపూర్, సుల్తాన్ పూర్, నేరడిగుంట పీహెచ్ సి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తదితర వ్యాధుల నమోదైన కేసుల వివరాలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించా రు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.సంగారెడ్డి నర్సింగ్ కళాశాల, పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జహీరాబాద్ ఎం సి హెచ్ లను త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. సంగారెడ్డి జి జి హెచ్ లో అవసరమైన ఎక్విప్మెంట్, మందులు అందుబాటులో ఉండాలని, నిరంతరం పర్యవేక్షించాలని జి జి హెచ్ సూపరింటెండెంట్ కు సూచించారు. విద్యా రంగంలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.కేజీబీవీ లు, మోడల్ స్కూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని మంత్రి ఆదేశించారు. పి హెచ్ సి లు,అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కె జి బి విలు,మోడల్ స్కూళ్లు, జడ్ పి హెచ్ ఎస్ లలో త్రాగునీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన పనులను పూర్తి చేయాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి విద్యార్థులు ఆహ్లాద వాతావరణంలో చదువు కునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. హాస్టళ్లకు సంబంధించి ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నా రు. కొత్త రేషన్ కార్డుల జారీ అంశంపై మంత్రి సమీక్ష స్తూ, ఈ నెల 15న ముఖ్యమంత్రి గౌ.రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితిపై మంత్రి సమీక్షిస్తు మంజీర, సింగూరు ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటి మట్టాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బోరంచ, భూసారెడ్డిపల్లి ఇంటెక్ వెల్‌ల ద్వారా జరుగుతున్న నీటి సరఫరాపై కూడా మంత్రి వివరాలు తెలుసుకున్నారు.జిల్లాలో ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితిని వాస్తవికంగా అంచనా వేసి, జిల్లాలో సరిపడు వర్షాలు పడని పక్షంలో రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత

- నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి
- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి బీరంగూడ డివిజన్లో 8.55 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

పటాన్ చెరువు ప్రజావాయిస్ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని..ప్రజా సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బీరంగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రూ.8.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుంటూ అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు ఎమ్మెల్యే జీఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, డి ఈ వెంకటరమణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కృష్ణ, మల్లేష్, గోపాల్, బాశెట్టి కృష్ణ, తులసి రెడ్డి, జగదీష్, దాసు, మల్లేష్, శ్రీనివాసరెడ్డి, సునీత, శ్రీకాంత్, గోవింద్, జ్ఞానేశ్వర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీవాసులు తదిరులు పాల్గొన్నారు.

రాంపూర్ గ్రామంలో వైభవంగా ఆషాఢ మాస బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించిన గ్రామస్తులు

కోట్ పల్లి/ప్రజా వాయిస్: సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాఢ మాసం సందర్భంగా మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో బోనాల పండుగ అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగింది. గ్రామ ప్రజలందరూ ఏకమై భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలకు ఘనంగా బోనాలను సమర్పించారు.కన్నుల పండువగా వేడుకలుగ్రామంలోని మహిళలు నూతన వస్త్రాలు ధరించి, ఎంతో పవిత్రంగా తయారు చేసిన బోనాలతో అమ్మవార్ల ఆలయాలకు ఊరేగింపుగా వెళ్లారు. మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా ఈ వేడుకలో ఉత్సాహంగా పాలుపంచుకోవడం విశేషం.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఢాక నీలమ్మ మహేశ్వర్ రెడ్డి, గ్రామ ప్రజలు మాట్లాడుతూ..మన సంప్రదాయాలను కాపాడుకుంటూ అమ్మవారిని కొలవడం మనందరి బాధ్యత. గ్రామంలోని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, పాడిపశువులు సమృద్ధిగా పెరగాలని, పంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకుంటూ గ్రామ దేవతలకు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు కోరడం జరిగింది.అని వారు తెలిపారు. అమ్మవారి దయతో రాంపూర్ గ్రామం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పండుగ పూట రాంపూర్ గ్రామం అంతటా పండుగ వాతావరణం సంతరించుకుంది.

చిన్న దగడలో డి-35 కాలువ ఎస్కేప్ సైఫన్ గేటు పరిశీలన

- రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులకు సూచన
- కాంగ్రెస్ పార్టీ యువనేతకొత్త కళ్యాణ్ కుమార్

ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని చిన్న దగడ సమీపంలోని డి–35 కాలువ ఎస్కేప్ సైఫన్ గేటు విరిగిపోవడంతో సాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యువనేత కొత్త కళ్యాణ్ కుమార్ శుక్రవారం సంబంధిత జేఈ నాగ హర్షిత్ తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. అనంతరం కొల్లాపూర్ నుంచి వెల్డర్‌ను పిలిపించి గేటు మరమ్మతులకు అవసరమైన ఎస్టిమేషన్ సిద్ధం చేసి, రెండు రోజుల్లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా కొత్త కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ, వర్షాల ప్రభావంతో రైతులు ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకుని రైతులకు సాగునీరు నిరాటంకంగా అందేలా చూడాలని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, "జై జవాన్ – జై కిసాన్" సిద్ధాంతంతో రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పదవి కిరీటం కాదు.. ప్రజలిచ్చిన బాధ్యత

- నేతన్నల సంక్షేమమే లక్ష్యం
- సేంద్రియ సాగుకు పెద్దపీట
- చేనేత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా
- మునుగోడును రాష్ట్రంలోనే ఆయిల్ పామ్, సేంద్రియ వ్యవసాయానికి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని వెల్లడి
- చండూరులో చేనేత దినోత్సవం, అభివృద్ధిపై సమీక్ష.
- మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

ప్రజా వాయిస్,నల్గొండ.చేనేత పరిశ్రమను పరిరక్షించడం, నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, మరోవైపు రైతులను సేంద్రియ వ్యవసాయం, ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించి మునుగోడు నియోజకవర్గాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చండూరు మున్సిపాలిటీలో చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత కళాకారుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన, అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి, సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.చేనేత దినోత్సవ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నేతన్నలకు చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పించే రంగం చేనేతేనని అన్నారు. ఆధునిక యంత్రాల ప్రభావంతో చేనేత వృత్తి సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు.చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన ఆయన, 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పెన్షన్లు, చేనేత సొసైటీల బలోపేతం, అర్హులందరికీ జియో ట్యాగింగ్, ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల విక్రయాల విస్తరణ వంటి అంశాలపై ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో చర్చిస్తానన్నారు. గత ప్రభుత్వం చేనేత సొసైటీలకు ఎన్నికలు నిర్వహించలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు నిర్వహించామని తెలిపారు.2009లో చేనేత కార్మికుల ఆత్మహత్యలు తనను తీవ్రంగా కలిచివేశాయని, అప్పట్లో గట్టుప్పల్‌లో ఒక చేనేత కుటుంబానికి అండగా నిలిచానని గుర్తు చేశారు. అనంతరం అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ద్వారా చేనేత సహకార సంఘాల రుణమాఫీ జరిగేలా కృషి చేశానన్నారు. ఎమ్మెల్యే పదవి కిరీటం కాదని, ప్రజలు ఐదేళ్ల పాటు సేవ చేయాలని అప్పగించిన బాధ్యత అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాయక నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ తనకు ఆదర్శమని, ఆయన ప్రాతినిధ్యం వహించిన ప్రాంతానికే తాను ఎమ్మెల్యేగా సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అభివృద్ధి సమీక్ష సమావేశంలో వ్యవసాయం, ఉద్యానవన శాఖల పనితీరును సమీక్షించిన ఎమ్మెల్యే, మునుగోడు నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోనే అత్యధిక ఆయిల్‌పామ్ సాగు జరిగే నియోజకవర్గంగా మునుగోడును తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు.రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూములు నిస్సారంగా మారుతున్నాయని, ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఆహారం ఔషధంగా మారాలంటే సేంద్రియ వ్యవసాయమే మార్గం" అని పేర్కొంటూ, ప్రతి గ్రామంలో నిబద్ధతతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను గుర్తించి వారిని ఆదర్శంగా నిలబెట్టాలని అధికారులకు సూచించారు. సేంద్రియ పంటలకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించే బాధ్యత తనదేనని, భవిష్యత్తులో మునుగోడు సేంద్రియ ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత,వివిధ శాఖల అధికారులు, చేనేత సహకార సంఘం ప్రతినిధులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అవ్వో నేను పొను సర్కారు బడికి?

- ప్రభుత్వ పాఠశాలలో విద్య అంతంత మాత్రమే!?
- పాఠశాల తనిఖీలు బిత్తరపోయి విషయాలు గ్రహించిన ఎమ్మెల్యే?
- లక్షల్లో జీతాలు తీసుకుంటున్న విద్యార్థుల్లో మార్పు రాలేదంటూ ఆగ్రహం!?
- నియోజకవర్గ మొత్తం కూడా ఇదే తంతుంటూ పిల్లల తల్లిదండ్రుల ఆవేదన!
- ఉపాధ్యాయుల పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ పిలుపు!?
- కోట్ల రూపాయల దుర్వినియోగంలో ఉపాధ్యాయులే ప్రధాన సూత్రధారుల!?
- దమ్మపేట మండలం పాకల గూడెంలో శుక్రవారం పాఠశాల తనిఖీలలో ప్రభుత్వ పనితీరు అంతా డొల్లే!?

ప్రజా వాయిస్ అశ్వారావుపేట ప్రత్యేక కథనం! నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల స్థితిగతులు అంతా డొల్లె,! అని మరోసారి రుజువైంది. సాక్షాత్తు నియోజకవర్గం అధికార ఎమ్మెల్యే తనిఖీల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ చేయడం తొ నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు తెలుగు అక్షరలలో మొదటి అక్షరం అ అన్న అక్షరాన్ని గుర్తించడంలో విద్యార్థులు తికమక పడటం ఆగ్రహించిన ఎమ్మెల్యే ఏమిటి మీ పనితీరు ప్రభుత్వ పాఠశాలలకు కోట్ల రూపాయలను మౌలిక సదుపాయాల కు ఏర్పాటు చేస్తే కనీసం ఆ అన్న అక్షరాన్ని సైతం గుర్తించలేని విద్యాబాధన కలిగి ఉన్నాయని హెచ్చరించడం సంచలన సృష్టిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో విద్యా అంతంత మాత్రమే ఉంటుందని లక్షల్లో జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయుల పిల్లల మాత్రం వేల రూపాయలు జీతాలు తీసుకుంటున్న ప్రవేట్ ఉపాధ్యాయులను మా పిల్లవాడు ఎలా చదువుతున్నాడు అని అడగటం విడ్డూరంగా ఉంటుందని కనీసం తరగతులు పెరుగుతున్న హాజరు శాతాన్ని పెంచుతున్నారే తప్ప విద్యా విధానంలో మార్పు రావడంలేదని ఉపాధ్యాయులకు వార్నింగ్ ఇవ్వడం శుక్రవారం నియోజకవర్గం లో హార్ట్ టాపిక్ గా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం లోని దమ్మపేట మండలంలో పాకల గూడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను అకస్మాత్తు తనిఖీ చేయగా పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య ఉన్నప్పటికీ విద్యార్థులు ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్య అభ్యాసం కొనసాగిస్తున్న సందర్భంలో నాలుగో తరగతిలో కేవలం నలుగురు పిల్లల మాత్రమే ఉండగా వారిలో ఒకరిని లేపి ఆ అనే అక్షరాన్ని గుర్తించాలని విద్యార్థిని అడగగా తెలీదని సమాధానం చెప్పటం ఎమ్మెల్యేకి షాక్ తగినంత పని అయిందని కొందరు సందర్కులు సైతం ఘటన నియోజకవర్గం లోని సంచలన సృష్టిస్తుంది దాంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే లక్షల రూపాయలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు పనితీరు మార్చుకోవాలని లేదంటే వృత్తిని వదిలేసి ఇంటి వద్దనే ఉండాలని విద్యా బోధనలను అందించేందుకు ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే దుర్వినియోగం చేస్తే సందర్భంలో ఉపాధ్యాయ కీలక పాత్ర వహిస్తున్నారంటూ ఆగ్రహించటం మండలంలో కొన్ని పాఠశాలలో విద్యాభ్యాసాలు అందిస్తున్న ఉపాధ్యాయులకు ఓ షాక్ ఇచ్చినంత పని అయిందని పిల్లల తల్లిదండ్రులు సైతం విమర్శిస్తున్నారు.

లక్షల్లో జీతాలు ప్రభుత్వం చెల్లిస్తుంటే కనీసం విద్యార్థులను మార్చలేరా!......ఎమ్మెల్యే జారీ

ప్రభుత్వ ఉపాధ్యాయులకు నెలకు లక్షల రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంటే విద్య బోధన చేయకుండా నచ్చిన రీతిలో ఉపాధ్యాయులు నడుచుకోవడం తప్ప విద్యార్థుల్లో మార్పు రావడంలేదని నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి ఆ అనే అక్షరాన్ని కూడా గుర్తించలేని పరిస్థితిలో విద్యార్థులు ఉంటున్నారని ఇంత దయనీయ పరిస్థితి నియోజకవర్గంలో ఏర్పడిందని ఉపాధ్యాయులు సమన్వయ పాటించాలని విద్యా బోధనలో కఠినంగా వ్యవహరించాలని విద్యార్థులకు విద్యాభ్యాసాలు సకాలంలో అందిస్తే విద్యార్థులు చిన్న వయసు నుండి విద్య అభ్యసిస్తారని ఉపాధ్యాయులు మాత్రం నాకెందుకులే అంటూ జీతాలు వస్తున్నాయి కదా వారి భవిష్యత్తు మాకు అవసరం లేదని గాలికి వదిలేస్తున్నారని ఇటువంటి ధోరణి వదిలేయాలని లేదంటే తక్షణమే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే శుక్రవారం హెచ్చరికను దారి చేసినంత పరిస్థితి మండలంలో ఏర్పడినట్లు విద్యార్థులు తల్లిదండ్రులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సైతం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి!?

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నెలసరి జీతాలు లక్షల రూపాయలు ఉన్నాయని వారి పిల్లలను మాత్రం ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రవేట్ టీచర్లు జీతాలు మాత్రం వేల రూపాయలు ఉంటున్నాయని ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రం తమ పిల్లలను వారి కంటే తక్కువ జీతాలు తీసుకుంటున్న టీచర్ల వద్ద విద్యాభ్యాసాలు నేర్పించి మరల మా అబ్బాయి ఎలా చదువుతున్నాడని ప్రైవేటు టీచర్లను అడగటం నిజంగా ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధనపై వారికే నమ్మకం లేని విద్యను లక్షల రూపాయలను ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించలేని నిరుపేద కుటుంబాల పిల్లలకు మాత్రం ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యాభ్యాసం చేయటం ఇటువంటి దుస్థితి తెలంగాణలో ఏర్పడిందని ఇటువంటి మార్పుని విద్యాశాఖ తక్షణమే మార్పు తేవాలంటూ తల్లిదండ్రులు సైతం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

దేవాలయాలే టార్గెట్... హుండీ చోరీల దొంగ అరెస్ట్

- మూడు రోజుల్లోనే కేసు ఛేదించిన హాలియా పోలీసులు
- సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో నిందితుడి గుర్తింపు
- ఐదు కేసుల్లో ప్రమేయం.. రూ.1,000 నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్ఐ. బండి సాయి ప్రశాంత్.

ప్రజా వాయిస్,నల్గొండ క్రైమ్.దేవాలయాలనే లక్ష్యంగా చేసుకుని హుండీ చోరీలకు పాల్పడుతున్న హ్యాబిచ్యువల్ ప్రాపర్టీ అఫెండర్‌ను హాలియా పోలీసులు అరెస్ట్ చేశారు. హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ పార్వతి సమేత జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఇటీవల జరిగిన హుండీ చోరీ కేసును పోలీసులు కేవలం మూడు రోజుల్లోనే శాస్త్రీయ, సాంకేతిక ఆధారాల సహాయంతో ఛేదించారు.హాలియా ఎస్ ఐ బండి సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం హాలియా పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.199/2026గా బీఎన్ఎస్ సెక్షన్ 305(d) కింద నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, క్లూస్ టీం సేకరించిన ఆధారాలు, సాంకేతిక సమాచారాన్ని విశ్లేషించి నిందితుడిని గుర్తించామన్నారు. శుక్రవారం అనుముల గ్రామ సమీపంలోని ద్వారకాపురి ఆర్చ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న దేవరకొండకు చెందిన గంజి వెంకటేష్ (33)ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడన్నారు.నిందితుడి వద్ద నుంచి ఈ కేసుకు సంబంధించిన రూ.1,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మద్యం అలవాటు, వ్యక్తిగత ఖర్చుల కోసం దేవాలయాల హుండీలనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. ప్రస్తుత కేసుతో కలిపి అతడిపై మొత్తం ఐదు కేసులు నమోదైనట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు.నిందితుడి నేర చరిత్రను పరిశీలించగా 2018లో దేవరకొండ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటి చోరీకి ప్రయత్నించిన కేసు, 2025లో నల్గొండ–1 టౌన్, నల్గొండ–2 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు దేవాలయ చోరీ కేసులు, 2026లో విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముత్యాలమ్మ దేవాలయంలో చోరీకి ప్రయత్నించిన కేసు నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుతం హాలియా దేవాలయ హుండీ చోరీ కేసుతో కలిపి మొత్తం ఐదు కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించామని,నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్, పోలీసు సిబ్బంది కొప్పుర వెంకన్న, ఏజాజ్‌ను సీఐ రాఘవరావు అభినందించారు.

చిగురుమామిడిలో అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం శ్రీకారం

- రూ.99 లక్షల పనులకు శంకుస్థాపనలు
- బొమ్మనపల్లిలో వెటర్నరీ సబ్ సెంటర్, వివో మహిళా సంఘ భవనాలకు శంకుస్థాపన
- మహిళా సాధికారతకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం

ప్రజా వాయిస్ – చిగురుమామిడి చిగురుమామిడి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. బొమ్మనపల్లి గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో వెటర్నరీ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి, రూ.16 లక్షల వ్యయంతో వివో మహిళా సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం చిగురుమామిడి మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో ప్రాథమిక పశువైద్య కేంద్రంలో అదనపు గదుల నిర్మాణం, మరమ్మతుల పనులకు కూడా శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బొమ్మనపల్లిలో ప్రభుత్వ స్థలంలో మహిళా సంఘ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, గ్రామంలోని ఇతర వివో సంఘాలకు కూడా త్వరలో భవనాలు నిర్మిస్తామని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు సరైన ఆర్థిక సహాయం అందలేదని, ప్రస్తుతం వడ్డీలేని రుణాలు అందిస్తూ మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ పథకాలు, బస్సులు, పెట్రోల్ బంకులు తదితర కార్యక్రమాల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో మహిళా సమాఖ్య భవనాలు, మండల కేంద్రాల్లో మండల మహిళా సమాఖ్య భవనాలు ఏర్పాటు చేసి మహిళా సంఘాల కార్యకలాపాలు నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రామాల మధ్య రోడ్డు అనుసంధాన పనులకు, 29 వంతెనల నిర్మాణానికి రూ.33 కోట్లు మంజూరైనందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుర్తి–ములకనూరు బ్రిడ్జి సహా మిగిలిన పెండింగ్ పనులు కూడా త్వరలో పూర్తవుతాయని చెప్పారు. కరీంనగర్ ఫోర్‌లైన్ రోడ్డు పనులు కూడా వేగంగా సాగుతాయని వెల్లడించారు.గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, రాజకీయాలకు అతీతంగా హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

పెబ్బేరు మండలంలో ధాన్యం మింగిన మిల్లర్లు

- రైస్ మిల్లర్లు భారీ కుంభకోణం
- రూ.14 కోట్లకు పైగా కుంభకోణం
- 4021 మెట్రిక్ టన్నుల ధ్యానం స్వాహా
- వనపర్తి జిల్లాపెబ్బేరులో రూ.14 కోట్ల స్కాం బట్టబయలు
- పరారీలో మిల్లర్ల యజమానులు

పెబ్బేరు (ఆగస్టు 7)ప్రజా వాయిస్ మండలంలోని రైస్ మిల్లర్ల చేతివాటం పతాకస్థాయికి చేరుకున్నది. సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ధాన్యం విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించినప్పటికీ కొంతమంది మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు.రైస్‌మిల్లర్ల భారీ కుంభకోణం బట్టబయలైంది.ఈ కేసులో రూ.14 కోట్లకు పైగా స్కాం బయటపడింది. 14 కోట్ల మేర ప్రభుత్వానికి కట్టాల్సిన బకాయిలకు ఎగనామం పెట్టడంతో అధికారులు రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేశారు.. దీంతో పోలీసులు రైస్ మిల్లు చుట్టూ తిరుగుతూ మిల్లుల యజమానుల కోసం గాలింపు చేపట్టారు.. కేసు నమోదు విషయం తెలుసుకొని రైస్ మిల్లర్ల యజమానులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి ఎవరికీ దొరకకుండా రైస్ మిల్లర్లు పరారీలో ఉన్నారు.. ఈ ఘటన పెబ్బేరు పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ శివారులోని జాతీయ రహదారిపై ఉన్న సాయి గోపాల్ ఇండోటెక్ రైస్ మిల్లు లో 2022–23 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్ లో 4806 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ దాన్యం నిలువ చేసుకోగా దానికి సంబంధించిన రూ.14,82,76,644 లను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉండగా నేటి వరకు మిల్లు యజమానులు చెల్లించలేదు. దీనిపై హైదరాబాద్ విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్, వనపర్తి జిల్లా సివిల్ సప్లై అధికారులు జూలై 27న రైస్ మిల్లులో సోదాలు జరపగా 780 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే చూపిస్తున్నారు.ఇంకా 4021 మెట్రిక్ టన్నుల ధాన్యం స్వాహా చేసినట్లు గుర్తించారు.. దీంతో సోదాలు జరిపిన ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్లు పూర్తి నివేదికతో వనపర్తి జిల్లా సివిల్ సప్లై మేనేజర్ కు నివేదిక అందజేశారు. వనపర్తి సివిల్ సప్లై డీఎం. ఆంజనేయులు గురువారం పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు రైసు మిల్లు వద్దకు, వారి ఇళ్ల వద్దకు వెళ్లి తనిఖీ చేశారు.కానీ ఈ విషయం ముందే తెలుసుకున్న మిల్లర్లు ఫోన్లు, స్విచ్ ఆఫ్ చేసి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరంగాపూర్ PHC పరిధిలో 'డ్రై డే' కార్యక్రమం క్షయ, వర్షాకాల వ్యాధులపై అవగాహన

ప్రజా వాయిస్, శ్రీరంగాపూర్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) పరిధిలో 'డ్రై డే' కార్యక్రమంలో భాగంగా స్థానిక వైద్యాధికారి రాములు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో , పంచాయతీ కార్యదర్శి , జిల్లా ఏ ఎల్ ఓ టీం సభ్యులు గంధం రాజు, లక్ష్మణ్ లక్ష్మి రెడ్డి కలిసి పాల్గొన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, అలాగే క్షయ (టీబీ) వ్యాధి పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.వైద్యాధికారి రాములు మాట్లాడుతూ, క్షయ వ్యాధి బారిన పడకుండా ప్రజలు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన వారు వైద్యుల సలహా మేరకు సరైన క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా, వర్షాకాలంలో దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి ఇళ్లలో ఉండే హౌస్‌లు, కుండలు, డ్రమ్ములను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వాటిలో మళ్లీ నీటిని నింపుకున్న తర్వాత తప్పనిసరిగా మూతలు బిగించుకోవాలని పిలుపునిచ్చారు. ఒకవేళ ఎవరికైనా జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకుని, సరైన చికిత్స తీసుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీదేవి, ఆశ వర్కర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచులో జూనియర్ కాలేజ్

ప్రజా వాయిస్ సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గౌట్ జూనియర్ కాలేజ్ పక్కనే నడి రోడ్డుపై ట్రాన్స్ఫారం వర్షాలు పడితే పశువులు కానీ మనుషులు కానీ ప్రమాదకరంగా మారిన ట్రాన్స్ఫారం ఎప్పుడు ప్రజలు వెళ్లే మార్గంలో ఈ ట్రాన్స్ఫారం ఉండడం అధికారుల సైతం చూసి చూడనట్టు వెళ్లడం గమనార్హం పక్కనే కూతవేటు దూరంలో కోర్టు ఉండడం అధికారుల సైతం 24 గంటలు దాన్ని చూస్తూనే వెళుతున్నారు గాని పట్టించుకోవడం లేదు దీనిపై పై అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ట్రాన్స్ఫర్ ను వేరే చోటికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు

లక్ష్యసాధన దిశగా విద్యార్థులు ముందుకు సాగాలి...

- పద్మశాలి సంఘం నేతలు వేముల రామ్మూర్తి, అయిల రమేష్

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా పట్టుదలతో ముందుకు సాగాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి అయిల రమేష్ సూచించారు.కీర్తిశేషులు పెగడ చందు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సుల్తానాబాద్ ప్రభుత్వ పాఠశాలలో ఆయన కుటుంబ సభ్యులు పదో తరగతి విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. చందు జ్ఞాపకార్థం తన కుటుంబ సభ్యులు ప్రతిఏటా విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పెగడ శారద, ఐలయ్య, పరశురాములు, జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు సాయిరి మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిబీపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- కేజీబీవీలో 'టిబీ ముక్త్ భారత్' అవగాహన సదస్సు డాక్టర్ రాజశేఖర్

ప్రజా వాయిస్, వనపర్తి జిల్లా : టిబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా వీపన గండ్ల కేజీబీవీ పాఠశాలలో టిబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మీసాల పార్వతి ఎంపీడీవో శ్రీనివాసరావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొని విద్యార్థులకు టిబీ వ్యాధిపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ,,, టిబీ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి మార్గాలు, వ్యాధిని సకాలంలో గుర్తించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, వైద్య సిబ్బంది అందించే సేవలను సద్వినియోగం చేసుకోవడం వంటి అంశాలను వివరించారు. వైద్యుల సూచనల మేరకు టిబీ చికిత్సను పూర్తిగా కొనసాగించి, నిర్ణీత కాలపాటు మందుల కోర్సును పూర్తి చేయాలని సూచించారు.టిబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స పొందితే పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు.టిబీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్ లో భువనేశ్వరీ మాత ఆలయంలో బోనాల ఉత్సవాలు

- అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి

ప్రజా వాయిస్ , మేడ్చల్ జిల్లా, కలెక్టరేట్: తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు భక్తి శ్రద్ధలతో జరుపుకునే రాష్ట్ర పండుగ అయిన బోనాల పండుగను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని భువనేశ్వరీ మాత ఆలయంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అందరూ కలిసి పండుగను వేడుకగా జరుపుకున్నారు. పోతరాజులతో కలిసి అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా నృత్యవిన్యాసాలతో పాటు డప్పు వాయిద్యాల మధ్య భోనాలను కార్యాలయం నుండి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మహిళా సిబ్బంది అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలను అమ్మవారికి సమర్పించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...

- చేనేత సొసైటీ అభివృద్ధికి రూ.15 లక్షలు కేటాయింపు
- ప్రభుత్వ విప్ విజయరమణ రావు.

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం సుల్తానాబాద్‌లోని శ్రీ వెంకటేశ్వర చేనేత సొసైటీ వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, భక్త మార్కండేయ, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత కార్మికులు ఎమ్మెల్యే విజయరమణ రావును ఘనంగా సన్మానించారు.చేనేత సొసైటీ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.10 లక్షలు, పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాల్ పూర్తి స్థాయి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. స్థానిక చేనేత సొసైటీ బకాయిల మాఫీ కోసం చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.చేనేత కార్మికుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి తనను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, వైస్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి ఐల రమేష్, ఉపాధ్యక్షుడు సాయిరి మహేందర్, ఓదెల దేవస్థానం చైర్మన్ చీకట్ల మొండయ్య, డైరెక్టర్ సామల యమున హరికృష్ణ, చేనేత సొసైటీ అధ్యక్షురాలు గోలి పద్మ శ్రీనివాస్, కౌన్సిలర్ గాదాసు మంజుల రవి, జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు మేరుగు యాదగిరి, మండల అధ్యక్షుడు గుండ మురళి, పోపా జిల్లా కార్యదర్శి సామల రాజేంద్ర ప్రసాద్, రాములు, కాంగ్రెస్ నాయకులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి మరువని తిరుగుబాటు పాట గద్దర్

- ములుగులో జరిగిన గద్దర్ మూడవ వర్ధంతి సభ
- కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గోల్కొండ బుచ్చన్న

ప్రజా వాయిస్; ములుగు జిల్లా: జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవన్ లో ప్రజా యుద్ధనౌక గద్దర్ మూడవ వర్ధంతి సభ ములుగు జిల్లా కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. గోల్కొండ బుచ్చన్న అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ములుగు కళాకారులు గద్దర్ కు పాటలతో నివాళి తెలియజేసి తన జ్ఞాపకాలని నెమరు వేసుకున్నారు. సామాజిక బాధ్యత మానవత్వం మరచిపోయి స్వార్థానికి తెగపడి అనగారిన జాతులను పీడిస్తున్న దోపిడీ వర్గాలపై పాటల ఆయుధాన్నిఎక్కుపెట్టి వారి జీవితాలు త్యాగం చేసిన మహనీయులను తెలంగాణ సమాజం ఎన్నటికి మరిచిపోదు.
ఈ సందర్భంగా గోల్కొండ బుచ్చన్న మాట్లాడుతూ... పాటకు పదును పెట్టి ప్రజాపక్ష పోరు నడిపిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని, తన జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని చివరి వరకు పాటతోనే పయనాన్ని కొనసాగించి ప్రజల గుండెల్లో నిలిచారని అన్నారు.
ప్రజా సంఘాల జేఏసీ నాయకులు జిల్లా సాధన సమితి అధ్యక్షులు ముంజాల బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ... పాట కోసం పనిచేసిన ప్రతి ఒక్కరిని గుండెల్లో పెట్టుకొని వారి ఆలోచనల మార్గంలో కొనసాగుతూ వారి సంతాప కార్యక్రమాలు చేసుకుంటూ మన ములుగు కళాకారులు గొప్ప సంస్కృతిని కొనసాగిస్తున్నారని ఇది ములుగు జిల్లాకు గర్వకారణమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోరిక సామ్యూల్ నాయక్, వావిలాల రాంబాబు, శంకర్, విజయ్, బాబా ఖాన్, రేలా కుమార్, కిరణ్, రాజేందర్, నాగరాజు, బద్రి, అరవింద్, కన్నం రాజు, మేఘం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ సమరభేరి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను తక్షణమే అమలు చేయాలి: సీపీఐ
- నేలకొండపల్లిలో ముగిసిన సీపీఐ ప్రజా చైతన్య యాత్ర
- కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం: జాతీయ సమితి సభ్యులు హేమంతరావు ధ్వజం

ప్రజా వాయిస్ ఖమ్మం: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసి, ప్రజా సమస్యలను పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిరసనగా సీపీఐ పోరాటాలకు సిద్ధమైంది. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల పరిధిలోని సదాశివపురంలో శుక్రవారం ప్రారంభమైన సీపీఐ ప్రజా చైతన్య యాత్ర భైరవునిపల్లి, అజేయ తండా మీదుగా మండల కేంద్రం చేరుకొని, ముఠాపురం వద్ద విజయవంతంగా ముగిసింది. యాత్ర పొడవునా గ్రామీణులు, పార్టీ శ్రేణులు సీపీఐ నేతలకు ఘన స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ప్రసంగించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ, దేశ సంపదను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతు చిక్కులు, సంక్షేమ పథకాల అమలులో వైఫల్యాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను యాత్రలో స్వయంగా తెలుసుకున్నామని చెప్పారు.
రైతులు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలని, ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రబాబు, సిద్దినేని కర్ణకుమార్, ఏపూరి లతాదేవి, కనకబండి సీతారాములు, మల్లెబోయిన ఉపేందర్, ఆలేటి ఉమామహేష్, ఇతర ప్రజాసంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లంక మల్లారం గ్రామపంచాయతీలో బెల్ట్ షాపులు నిషేధం

- కాంగ్రెస్ పార్టీ నేతలే బెల్ట్ షాపులు నడుపుతున్నట్లు గ్రామంలో విమర్శలు
- విద్య వైద్యం ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించిన గ్రామ సర్పంచ్
- బెల్ట్ షాపులు మద్యపానం నిషేధం పై సర్పంచ్ పూణెం రమేష్ కీలక నిర్ణయం

ప్రజా వాయిస్ మణుగూరు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణ శివారు ప్రాంతమైన లంక మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో గత కొద్ది కాలంగా మద్యం ఏరులై పారుతుంది. కాంగ్రెస్ పార్టీలో కీలకపాత్రను పోషించే కొంతమంది నేతలు. అమాయక ఆదివాసులనే టార్గెట్ చేసి మద్యం విక్రయాలు పెంచినట్లు గ్రామంలో విమర్శలు రావడంతో. లంక మల్లారం కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీ సర్పంచ్ పూణెం పరమేష్ ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. గ్రామంలో ప్రజలు మద్యానికి బానిస కావద్దని ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో నివసించే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా జీవించాలని ప్రజలను కోరారు. యువత మత్తుకు బానిస కాకుండా విద్య పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన వివరించారు. తదుపరి మద్యపానం నిషేధం పై గ్రామ ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి. గ్రామంలో మద్యపానం పూర్తిగా నిషేధించే విధంగా ప్రతిపాదన ప్రకటించారు. దాంతో సర్పంచ్ నిర్ణయాలు గ్రామ శ్రేయస్సు కోరే విధంగా ఉన్నాయని గమనించిన గ్రామ ప్రజలు మహిళలు యువత బెల్ట్ షాపులు గ్రామంలో లేకుండా చేయాలని సర్పంచ్ పూణెం రమేష్ ను గ్రామస్తులు కోరారు దాంతో స్పందించిన గ్రామ సర్పంచ్ పూణెం రమేష్. గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా ఎత్తివేస్తానని గ్రామ ప్రజలకు తెలుపుతూ గ్రామంలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధిస్తున్నట్లు. ఆమోదముద్ర వేశారు. తదుపరి సర్పంచ్ గ్రామ ప్రజలతో మాట్లాడుతూ. గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగంగా విద్యా వైద్యం పారిశుద్ధ్యం ఆరోగ్యం పేదరికం నిర్మూలన వంటి వసతులు గ్రామపంచాయతీ ప్రజలకు అందించే ప్రయత్నంలోనే మద్యపానం పూర్తిగా. నిషేధించినట్లు మీడియాకు తెలిపారు. డిపార్ట్మెంట్ అధికారులు కూడా ప్రజల ఆరోగ్య పట్ల సానుకూలంగా స్పందించి ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు తీర్చే విధంగా చర్చించడం జరిగిందని ఆయన ధీమా వ్యక్తం చేశారు...

పలు సమస్యలతో దరఖాస్తులు అందించిన గ్రామస్తులు...

లంక మల్లారం గ్రామపంచాయతీలో గ్రామ రహదారులు పూర్తిగా అస్తవ్యస్తంగా ఉన్నట్లు గ్రామపంచాయతీ సర్పంచ్ కి గ్రామస్తులు 15 దరఖాస్తులు ఇచ్చారు. ఐకెపి డ్వాక్రాకు సంబంధించిన దరఖాస్తులు ఒకటి ప్రైమరీ స్కూలుకు సంబంధించిన దరఖాస్తులు రెండు ఇంకుడు గుంటలు మంజూరు కోసం మరో రెండు దరఖాస్తులు గ్రామస్తులు గ్రామ సర్పంచికి అందజేయడం జరిగింది. గ్రామంలో నివసించే వృద్ధులకు ఒంటరి మహిళలకు వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని సర్పంచ్ ను కోరారు. అదేవిధంగా మద్యపానం నిషేధం గురించి సర్పంచ్ సానుకూలంగా సహకరించినందుకు గ్రామ మహిళలు కృతజ్ఞతలు తెలిపారు... లంక మల్లారం గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే సహించేది లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యపానం నిషేధం పై గ్రామ ప్రజలంతా ఏకగ్రీవ తీర్మానం జరిగిన కారణంగా లంక మల్లారం గ్రామంలో మద్యం అమ్మకాలు జరిపితే మహిళల ఉగ్రరూపం చూడవలసి వస్తుందని హెచ్చరించారు...

గ్రామ అభివృద్దే నాలక్ష్యం

- గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమిస్తా
- శివరామపురం సర్పంచ్ హేమలత

ప్రజా వాయిస్, వరంగల్ (రాయపర్తి): రాయపర్తి మండల పరిధిలోని శివరామపురం గ్రామం అభివృద్ధి వైపు శరవేగంగా పరిగెడుతోంది. సుదీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యలను ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తూ, గ్రామ స్వరూపాన్ని మార్చేయడంలో స్థానిక మహిళా సర్పంచ్ చూపుతున్న చొరవపై గ్రామ ప్రజల నుంచి ప్రశంసలు కురిపిస్తున్నారు. గ్రామంలో ఏళ్ల తరబడి వేధిస్తున్న తాగునీటి కొరతకు శాశ్వత పరిష్కారం చూపడం, గ్రామ ప్రజలకు ఎంతో ప్రాధాన్యమున్న బతుకమ్మ ప్రాంగణాన్ని మోడల్ ఏరియాగా తీర్చిదిద్దడంతో సర్పంచ్ కృషికి అద్దం పడుతోంది. గతంలో సమస్యల నిలయంగా మారిన బతుకమ్మ ప్రాంగణాన్ని సుందరీకరించి, మహిళలు పండుగను ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకునేలా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా, గ్రామంలో రోగాల బారిన పడకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. దెబ్బతిన్న, పూడికపారిన మురికి నీటి కాలువలను పునరుద్ధరించి, మురుగునీరు సఫీగా పారేలా పనులు పూర్తి చేశారు. సుదీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ గ్రామ అభివృద్ధిలో చురుగ్గా పాల్గొంటున్న మహిళా సర్పంచ్ పాలనా దక్షతను, కృషిని గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలు కొనియాడుతున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకుసాగుతున్న సర్పంచ్ సేవలకు గ్రామ ప్రజలు నీరాజనాలు పడుతున్నారు.

పుట్టినరోజు వేళ.. పాఠశాలకు 'ఆన్‌లైన్' కానుక

ప్రజా వాయిస్, కోరుట్ల: తన పుట్టినరోజును పురస్కరించుకుని సామాజిక స్పృహ చాటుకున్నారు కోరుట్ల మండలం కల్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు. శుక్రవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఉన్నత ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిజిటల్ విద్య చేరువయ్యేలా, ఆన్‌లైన్ క్లాసులు వినేందుకు వీలుగా అవసరమైన పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు తన వంతు సాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి జి. నటేశం, గ్రామ సర్పంచ్ చల్లా లత రమేష్ పాల్గొని శ్రీనివాసరావును అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు ఇలాంటి దాతల సహకారం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరహరి, అసోసియేట్ అధ్యక్ష కార్యదర్శులు పడాల నారాయణ గౌడ్, రాజమడుగు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు. వీరితో పాటు గ్రామ పుర ప్రముఖులు, ఉపాధ్యాయ బృందం, ఏ. సతీష్ రావు, బి. శ్రీనివాసరావు, బండ రాజ్వీర్, వి. రాజేశ్వరరావు, మండలాలు రవీందర్, పి. కిషోర్, కె. తిరుమల రాజేందర్, పి. లక్ష్మీనారాయణ, బెల్లాల సత్యనారాయణ, సదుల ప్రదీప్, పి. శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చేనేత కార్మికుల దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు ఘన సన్మానం

ప్రజా వాయిస్, హన్మకొండ, హసన్ పర్తి : లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్ పర్తి ఆధ్వర్యంలో జాతీయ చేనేత కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హసన్ పర్తి పారిశ్రామిక ఉత్పత్తుల సంఘంలో చేనేత కార్మికులకు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్ డాక్టర్ దీవి అజిత్ కుమార్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత రంగం ప్రతీక అని, చేనేత కార్మికులు తమ కృషితో దేశ వారసత్వాన్ని భావితరాలకు అందిస్తున్నారని అన్నారు. నేటి ఆధునిక యుగంలో కూడా చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చేనేత కార్మికుల సంక్షేమానికి సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

పండుగ సాయన్న విగ్రహం తొలగింపుపై రాజ్యాధికార పార్టీ ఆగ్రహం

- డీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్
- అదే స్థలంలో విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలని నిరసన ర్యాలీ

ప్రజా వాయిస్, అచ్చంపేట: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని తొలగించిన ఘటనపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. స్థానిక ముదిరాజ్ యువకులు, ప్రజలు తమ సొంత విరాళాలతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరణకు ముందే అధికారులు తొలగించడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని పార్టీ నాయకులు ఆరోపించారు. పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు భీసం అంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు లింగాలకు చేరుకుని భారీ నిరసన చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లింగాల పోలీస్ స్టేషన్‌కు ర్యాలీగా వెళ్లి అచ్చంపేట ఆర్టీసీ డీఎంపై ఫిర్యాదు చేశారు. విగ్రహాన్ని తొలగించిన ఘటనపై సంబంధిత అధికారిపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సస్పెండ్ చేయాలని, అలాగే తొలగించిన అదే స్థలంలో పండుగ సాయన్న విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

కొమరం భీమ్ విగ్రహ ఏర్పాటు పనులు పరిశీలించిన చుంచు రామకృష్ణ

ప్రజా వాయిస్/చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో శుక్రవారం నాడు చర్ల మండల కేంద్రానికి విచ్చేసిన 9 ఆదివాసి తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ తుడుం దెబ్బ ఆఫీస్ ప్రాంగణంలో కొమరం భీం విగ్రహాన్ని ఏర్పాటు పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ఆదివాసి పోరాట వీరుడి కొమరం విగ్రహం ఏర్పాటు చేసుకోవడం ఆదివాసి యువత మరియు ఆదివాసి ఉద్యోగులు ప్రజానీకం వీరిని పోరాట పటిమ యాది గుర్తుపెట్టుకుని రాబోయే ఆదివాసి సమాజం కోసం నిలబడటం గొప్ప శుభపరిమాణం అని అన్నారు, అనంతరం చలో కొత్తగూడెం కార్యక్రమాన్ని విజయవతం చేయాలని ఆదివాసి ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆదివాసి తుడుం మోతతో లంబాడి హటావో అని ఆదివాసి గొంతుకలతో మారు మోగాలని ఆదివాసీ సమాజానికి ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆదివాసీనియర్ నాయకులు. ఇర్ప. వసంత్, ఇర్ప.ప్రకాష్, కారం. నరేష్, సోడి అనిల్ కుమార్, కోరం. బిట్టు, కోరం. సూర్యనారాయణ, ఇర్పా.అరుణ్ కుమార్, కోరం వేణు తదితరులు పాల్గొన్నారు

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జైల్ భరో

- **రైతులు, కార్మికులు , మేధావులు కదలాలి..**
- **బొమ్మలరామారం మండలంలో జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి :.రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యాకల శ్రీశైలం**

ప్రజా వాయిస్, యాదాద్రి భువనగిరి జిల్లా /బొమ్మలరామారం: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల ఆగస్టు 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని బొమ్మలరామారం మండలంలో జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యాకల శ్రీశైలం పిలుపునిచ్చారు. బొమ్మలరామారం మండలం లోని గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, మేధావులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లను ఆయన ప్రస్తావించారు. భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధంగా అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం తీసుకురావాలని కోరారు. అలాగే విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, పంటల బీమా పథకాన్ని రైతులకు ఉపయోగపడే విధంగా మార్చాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం, 2006 అటవీ హక్కుల చట్టం, 2011 కౌలుదారుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. VB-G RAM G చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి, కిష్టయ్య, శ్రీరాములు, బాలమల్లు, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మనసికఉల్లాసానికి క్రీడలు ప్రాముఖ్యం:డా.నాగేశ్వరీ

ప్రజా వాయిస్ , తెలకపల్లి మండలం : ఆలేరు ఆరోగ్య ఉపకేంద్రం ఏ.ఎన్.ఎం నిరంజనమ్మ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక నాగర్‌కర్నూలు జిల్లా, తెలకపల్లి మండలంలోని ఆలేరు ఆరోగ్య ఉపకేంద్రంలో ఏ.ఎన్.ఎం గా విధులు నిర్వహిస్తున్న అలువాల నిరంజనమ్మ తెలంగాణ 12వ రాష్ట్రస్థాయి జావెలిన్ డే సెలబ్రేషన్ పురుషులు, మహిళలు, సబ్ జూనియర్ మరియు జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావడం గౌరెడ్డిపల్లి గ్రామానికి గర్వకారణమని బొప్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గుంపల్లి నాగేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆగస్టు 8న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ 12వ రాష్ట్రస్థాయి జావెలిన్ డే సెలబ్రేషన్ పురుషులు, మహిళలు, సబ్ జూనియర్ మరియు జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో నిరంజనమ్మ మహిళల విభాగం జావెలిన్ త్రో ఈవెంట్‌లో పాల్గొననున్నారు.గత నెల జూలై 6న కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అథ్లెటిక్స్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. నిరంజనమ్మ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల బొప్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గుంపల్లి నాగేశ్వరి, ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకం సాధించాలని ఆకాంక్షించారు.

ఎల్ నినో పరిస్థితుల్లో ఆరుతడి, కూరగాయల పంటల సాగు మేలు

ప్రజా వాయిస్, మహబూబాబాద్: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఐ.ఏ.ఎస్., ఆదేశాల ప్రకారం మహబూబాబాద్ జిల్లాలో 4000 ఎకరాలలో కూరగాయలు సాగు విస్తీర్ణానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగింది. జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న అధ్యక్షతన మండలాల సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 524 ఎకరాల్లో మహిళా స్వయం సహాయ సంఘాల ద్వారా, వ్యవసాయ సహకారంతో కూరగాయలు సాగును చేపట్టడం జరిగింది. ప్రస్తుత వానాకాలంలో అనుకూలంగా ఉన్న టమాటా, వంగ, పచ్చి మిరప, బీర,సొర,కాకర, బోడ కాకర,బెండ, చిక్కుడు, ఆకుకూరలు, మొదలైన అన్ని రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. కురవి, డోర్నకల్, మరిపెడ ,చిన్నగూడుర్, నర్సింహులపేట, తొర్రూరు, దంతాలపల్లి, నెల్లికుదురు, మహబూబాద్, గూడూరు, కేసముద్రం, కొత్తగూడ, గంగారం, తదితర అన్ని మండలాల్లో జిల్లా వ్యాప్తంగా సాగు చేస్తున్నారు. కూరగాయ రైతులు ఆధునిక పద్ధతులు (పందిరి సాగు , ట్రెల్లిస్ , ఎత్తు మడులు, మల్చింగ్ , బిందు సేద్యం, ఫారం పాండు (నీటి కుంటలు – పంట కుంటలు) సేంద్రియ పద్ధతులు, నేచురల్ ఫార్మింగ్ , మార్కెటింగ్ , తదితర వాటిని రైతులు పాటించే విధంగా సన్నద్ధం చేయాలని తెలిపారు. రైతు రైతులకు ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయం వస్తుంది.కనుక రైతులను కూరగాయల సాగు చేసే విధం గా అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఐకెపి డీపీఎం శ్రీకాంత్, ఉద్యాన అధికారులు ఎ జే శాంతిప్రియదర్శిని, ఎం స్రవంతి, కార్యాలయ సిబ్బంది జ్యోస్న, సుకన్య, రామకృష్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**

జిన్నారం ప్రజావాయిస్ : గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. గురువారం గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో మద్దటి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బంగారమ్మ బోనాలు, నవ చైతన్య మాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకలకు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవతల అనుగ్రహంతో ప్రతి కుటుంబం సుఖ శాంతులతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు స్థానిక నాయకులు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- **రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళికెరి**

ప్రజా వాయిస్, మహబూబాబాద్ : జనగణన–2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్ బుక్ తయారీకి అవసరమైన గ్రామ డైరెక్టరీ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళికేరి అన్నారు.

హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మహబూబాబాద్ కలెక్టరేట్ నుండి సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జన గణన సంచాలకులు మాట్లాడుతూ భారత ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం– న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర జనగణన సంచాలకుల కార్యాలయం మార్గదర్శకాల మేరకు జిల్లాల పరిధిలో అన్ని చార్జ్‌ల పరిధిలో ఫీల్డ్ ఫంక్షనరీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణల ద్వారా సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఏకరూపత, ఖచ్చితత్వం, నాణ్యతను నిర్ధారించేందుకు సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్ సేవలు, పోస్టల్ సేవలు, వ్యవసాయం, మార్కెటింగ్ సౌకర్యాలు, సామాజిక, ఆర్థిక మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి జిల్లా జనగణన హ్యాండ్ బుక్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసే విధానంపై క్షేత్ర సిబ్బందికి తగు శిక్షణ అందించాలని తెలిపారు. చార్జ్ అధికారులు తమ పరిధిలోని ఫీల్డ్ ఫంక్షనరీలకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడంతో పాటు, వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ప్రతి గ్రామం, పట్టణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. నమోదయ్యే ప్రతి సమాచారం సంపూర్ణంగా, ఖచ్చితంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. హ్యాండ్ బుక్ పార్ట్ – ఎ లో గ్రామ, పట్టణ డైరెక్టరీలు, పార్ట్ – బి లో ప్రాథమిక గణన సారాంశం ఉంటాయని తెలిపారు. మొబైల్ యాప్, వెబ్ పోర్టల్, అవసరమైతే భౌతిక షెడ్యూల్ ద్వారా సమాచార సేకరణ జరుగుతుందని తెలిపారు. ఛార్జ్ అధికారుల బాధ్యతలు, ఫీల్డ్ సిబ్బంది నియామకం, యూజర్ ఐడీల సృష్టి, శిక్షణ నిర్వహణ, ఫీల్డ్ వర్క్ పర్యవేక్షణ, డేటా ధృవీకరణ, నిర్ణీత గడువులో పనుల పూర్తి వంటి అంశాలు పొందుపరచబడి ఉంటాయని, డేటా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామ/పట్టణ కోడ్లు సక్రమంగా నమోదు చేయాలని, తప్పనిసరి వివరాలన్నీ నమోదు చేయాలని, డూప్లికేట్ సమాచారం లేకుండా సంబంధిత శాఖల రికార్డులతో సరిపోలే విధంగా సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. డేటా భద్రత పరంగా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను గోప్యంగా ఉంచాలని, అధికారిక యాప్, పోర్టల్ మాత్రమే ఉపయోగించాలని, అధికారిక సమాచారాన్ని సోషల్ మీడియా / వ్యక్తిగత మెసేజింగ్ ద్వారా పంచరాదని, పని పూర్తయిన వెంటనే లాగ్ అవుట్ చేయాలని తెలిపారు. అలాగే ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం సహాయ వ్యవస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ జనగణన హ్యాండ్‌బుక్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, విధాన నిర్ణయాలు, పరిశోధనలకు ప్రామాణిక సమాచార గ్రంథంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఫీల్డ్ ఫంక్షనరీలకు 23 వ తేదీన శిక్షణ ఇవ్వడం జరిగిందని, వారు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, సమాచార సేకరణ చేయాలని, వెబ్ సైట్ పోర్టల్ ఆగస్ట్ 10 నుండి సెప్టెంబర్ 8 వరకు అందుబాటులోకి వస్తుందని నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

న్యాయవాదుల్లో క్రీడాస్ఫూర్తి నింపిన బార్ అసోసియేషన్..

- **ఘనంగా ప్రారంభమైన స్వాతంత్ర్య దినోత్సవ క్రీడలు**
- **క్యారమ్ ఆడి పోటీలకు శ్రీకారం చుట్టిన న్యాయమూర్తులు.**
- **క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఐక్యతకు దోహదమని వ్యాఖ్య**

మిర్యాలగూడ, ప్రజా వాయిస్: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల కోసం నిర్వహిస్తున్న క్రీడా పోటీల ప్రారంభోత్సవం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. న్యాయవాదుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వృత్తిపరమైన ఒత్తిడిని తగ్గించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. పవన్ కుమార్, మొదటి జూనియర్ సివిల్ జడ్జి ఎం. లావణ్య రాణి, రెండవ జూనియర్ సివిల్ జడ్జి వి. అరుణ్ తేజ్ హాజరయ్యారు. అతిథులు కలిసి క్యారమ్ బోర్డు ఆడి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. నిత్యం వృత్తిగత ఒత్తిడిలో పనిచేసే న్యాయవాదులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని అందిస్తాయని తెలిపారు. ఇలాంటి పోటీలు పరస్పర సోదరభావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఇసరం కరుణాకర్, ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య, సంయుక్త కార్యదర్శి రాయారపు భాస్కర్, కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, గేమ్స్ సెక్రటరీ భూక్యా రమేష్‌తో పాటు కందిబండ శ్రీనివాస్, ఏ. స్వరాజ్యం, ఆస్మా, బాలు, కొంక వెంకన్న, దూపాటి మట్టయ్య, వీరేంద్ర నాయుడు, సోమిరెడ్డి, వీర్ల వినోద్, సీహెచ్. వీడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు చెందిన గౌరవ సభ్యులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడా పోటీల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- **హాస్టల్ భద్రతపై ప్రశ్నలు...**
- **సుమారు 60 ఆస్తమా టాబ్లెట్లు మింగిన ఫస్ట్ ఇయర్ బైపీసీ విద్యార్థిని...**
- **ఒంటరితనం, మనస్తాపమే కారణం అంటూ విద్యార్థిని వెల్లడి...**
- **హాస్టల్‌లోకి భారీ మొత్తంలో టాబ్లెట్లు ఎలా లభ్యం అయ్యాయి అనే అంశంపై అధికారుల దృష్టి...**

ప్రజా వాయిస్, భద్రాచలం : భద్రాచలంలోని గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో గురువారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఫస్ట్ ఇయర్ బైపీసీ చదువుతున్న మరకం సరస్వతి (16) అనే విద్యార్థిని సుమారు 60 ఆస్తమా టాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆమెను తోటి విద్యార్థులు అపస్మారక స్థితిలో గుర్తించి వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆమెకు చికిత్సఅందిస్తున్నారు.

ఇందులో భాగంగానే ప్రాథమిక విచారణలో విద్యార్థిని కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారం. హాస్టల్‌లో తాను ఒంటరిగా ఉంటున్నానని, తోటి విద్యార్థులు తనతో మాట్లాడటం లేదని, ఉపాధ్యాయులు కూడా తనను పట్టించుకోవడం లేదనే భావనతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిపింది. ఇంటికి తీసుకెళ్లాలని పలుమార్లు తల్లిదండ్రులను కోరగా వారు నిరకరించడం తో మరింత ఆవేదనకు గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ ఘటనతో గురుకుల కళాశాలలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా హాస్టల్‌లోకి ఇంత పెద్ద మొత్తంలో ఆస్తమా టాబ్లెట్లు ఎలా వచ్చాయి? వాటిని విద్యార్థిని ఎలా సంపాదించింది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హాస్టల్‌లో మందుల నిల్వలు, భద్రతా పర్యవేక్షణ, విద్యార్థుల సామగ్రి తనిఖీలపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఘటనపై అన్ని కోణాల్లో విచారణ చేపట్టి, నిర్లక్ష్యం ఎక్కడైనా జరిగిందా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, హాస్టళ్లలో కౌన్సెలింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలోఘనంగా ఆరోగ్యశ్రీ దినోత్సవ వేడుకలు

ప్రజావాయిస్ , మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ లో ఎం ఆర్ పి ఎస్ ,ఎం ఎస్ పి మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం ఆర్ పి ఎ స్ ,ఎం ఎస్ పి జిల్లా ఇంచార్జి జన్ను దినేష్ మాదిగ,జిల్లా కో కన్వీనర్ ఏక్ శంకర్ మాదిగ మరియు మాదిగ మహిళా సమాఖ్య జాతీయ అధికార ప్రతినిధి ఇనుగుర్తి మణెమ్మ,మహాజన మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎండి రజియాలు పాల్గొని మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడిన మహానేత, ఆరోగ్యశ్రీ పథకానికి స్ఫూర్తిదాత అయిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ముస్లిం మహిళ తన కుమార్తె గుండెజబ్బుతో బాధపడుతూ లక్షల రూపాయలు అవసరమవుతున్నాయని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ని ఆశ్రయించిందని తెలిపారు. ఆమె బాధను తెలుసుకున్న మందకృష్ణ మాదిగ ఆనాటి ముఖ్యమంత్రి డా. వైఎస్. రాజశేఖరరెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, పేదలకు ఉచిత వైద్యం అందించాలంటూ నిరంతర పోరాటం చేశారని పేర్కొన్నారు.

2004లో వేలాది గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నపిల్లలతో హైదరాబాద్‌లో చేపట్టిన ఉద్యమ ఫలితంగానే ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఈ విషయాన్ని ఆనాటి ముఖ్యమంత్రి డా. వైఎస్. రాజశేఖరరెడ్డి అసెంబ్లీలో కూడా ప్రస్తావించారని గుర్తుచేశారు. ఎంఆర్‌పీఎస్ ఉద్యమం కేవలం మాదిగల రిజర్వేషన్‌ల కోసమే కాకుండా సమాజంలోని పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కూడా అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయించడం, తెల్ల రేషన్ కార్డు దారులకు రేషన్ కోటా పెంపు, మహిళలపై అత్యాచారాల నిరోధానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటి అంశాల్లో కూడా ఎంఆర్‌పీఎస్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఎక్కడ పేదలకు అన్యాయం జరిగినా ఎంఆర్‌పీఎస్ వారి పక్షాన నిలబడి పోరాడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పోలేపాక ప్రవీణ్, ఇరుగు రవి,ఎం ఎస్ పి జిల్లా నాయకులు పోలేపాక ఎల్లయ్య మాదిగ,సురుగు ఐలయ్య మాదిగ,వి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు ఎండి పాషా,ఎం ఎస్ పి జిల్లా నాయకులు కంది పాటి బిక్షపతి మాదిగ, పులి సోమయ్య మాదిగ,నందిపాటి రాఘవులు, ఎం ఎం ఎస్ మహిళా జిల్లా నాయకురాళ్లు కత్తుల రేణుక, గుండెల సరిత, మంద సావిత్రి,గుంటుక రేణుక, కోళ్ల చంద్రకళ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం....

- **రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు......**
- **పోలీస్, NHAI సమన్వయంతో చర్యలు చేపట్టాలి.....**

ప్రజా వాయిస్, మెదక్ : NH-44పై బంగారమ్మ టెంపుల్, కుచారం బ్లాక్‌స్పాట్‌లను పరిశీలించిన మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్ మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా NH-44 జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్‌లను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధానంగా NH-44 నుంచి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రహదారులు, డివైడర్ ఓపెనింగ్‌లు ఉన్న ప్రాంతాలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా బంగారమ్మ టెంపుల్, కుచారం గ్రామం వద్ద ఉన్న బ్లాక్‌స్పాట్‌లను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్న పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రాంతాలు అధికంగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయని, ముఖ్యంగా వాహనాలు యూటర్న్ తీసుకునే ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అధికారులు ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎ ఐ రీజినల్ మేనేజర్ రంగారావుతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ చర్చించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన ప్రత్యామ్నాయ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

ముఖ్యంగా డివైడర్ ఓపెనింగ్‌లు, గ్రామాల అనుసంధాన రహదారుల వద్ద వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని, అవసరమైన భద్రతా ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ వెంట డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐలు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్‌తో పాటు అధికారులు ఉన్నారు.

మరోసారి పరమత సహనాన్ని చాటుకున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- **రూ.25 లక్షల సొంత నిధులతో చోటి మసీదు భవన నిర్మాణానికి అండ..**

పటాన్ చెరువు, ప్రజావాయిస్ : పరమత సహనం, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు.

పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎంజి రోడ్డు లో గల చోటి మసీదు ప్రార్ధన స్థలానికి చెందిన స్థలంలో 25 లక్షల రూపాయల సొంత నిధులతో భవనాన్ని నిర్మించి మసీదు నిర్వాహకులకు అందించారు.. ఈ మేరకు శుక్రవారం మత పెద్దల సమక్షంలో భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోటి మసీదు ఆర్థిక అవసరాలు తీర్చడంలో నూతన భవనం సహాయకారిగా ఉంటుందని తెలిపారు. ప్రపంచంలోని అన్ని మతాలు శాంతి, ప్రేమ, మానవత్వాన్నే బోధిస్తాయని అన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనోభావాలను గౌరవించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, పరస్పర గౌరవంతో జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందించడంలో భాగంగా నేటి వరకు సొంత నిధులతో 200 లకు పైగా దేవాలయాలు, 100కు పైగా మసీదులు, 20 కి పైగా చర్చిలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే జిఎంఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ముస్లిం మత పెద్దలు లియాకత్ అలీ, మొయిజుర్ రెహ్మన్, ఇక్బాల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన పిల్లలకు తల్లిపాలే శేష్కారం సర్పంచ్ బోడ రవి

ప్రజా వాయిస్, నర్సంపేట : చెన్నారావు పేట మండలం ధర్మ తండ గ్రామపంచాయితీ నడిమి తండ లో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు గురువారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ బోర్డ రవి ఉప సర్పంచ్ బిక్షపతి మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ఎంతో శ్రేష్టకరమని జ్ఞాపకశక్తిని పెంచుతాయని ముర్రుపాలు ఇవ్వడం వల్ల తల్లిరొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కవిత సుజాత వార్డు మెంబర్ నరసింహ స్వరూప పంచాయితి కార్యదర్శి చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో కాస రాజు 100 కిలోమీటర్ల రన్ విజయోత్సవ సభ

ప్రజా వాయిస్, మిరుదొడ్డి : సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన కాస రాజు పూణే నుంచి బారామతి వరకు 100 కిలోమీటర్ల అల్ట్రా రన్‌ను కేవలం 14 గంటల్లోనే విజయవంతంగా పూర్తి చేయడం పట్ల మిరుదొడ్డి రన్నర్స్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ విజయోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని యువకులు, విద్యార్థుల కోసం 2కే రన్ నిర్వహించి, అందులో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు నాయకులు, నిర్వాహకులు.. మిరుదొడ్డి గ్రామానికి చెందిన కాస రాజు 100 కిలోమీటర్ల సుదీర్ఘ రన్‌ను పూర్తి చేయడం స్థానికులకు ఎంతో గర్వకారణమని కొనియాడారు.మారథాన్, చివరికి అల్ట్రా రన్ వరకు ఎదిగిన కాస రాజు నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదని, శారీరక మరియు మానసిక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ రోజువారీజీవితంలో వ్యాయామం, రన్నింగ్, వాకింగ్‌లను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 2కే రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు, విద్యార్థులకు అంబలి,అరటిపండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎలుముల మహేశ్వరి దేవరాజు, అందే సర్పంచ్ యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి,బీజేపీ మండల అధ్యక్షుడు మరియు కొండాపూర్ సర్పంచ్ అమర్, ఉప సర్పంచులు పెద్ద కుర్మ కరుణాకర్, పరశురాములు పాల్గొన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో అత్యవసర వైద్య సహాయంపై అవగాహన కార్యక్రమం

ప్రజా వాయిస్, హన్మకొండ జిల్లా ప్రతినిధి : కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) సేవార్థ్ క్లబ్ (సోషల్ సర్వీస్ క్లబ్) ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైల్వే సిబ్బందికి అత్యవసర వైద్య సహాయంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ & అదనపు డీఎంఈ డా. డి. మోహన్‌దాస్ మార్గదర్శకత్వంలో, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా. శ్రీనివాస్ రామక సౌజన్యంతో, వరంగల్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీ సుదర్శన్ సహకారం తో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 నుంచి 35 మంది రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. వారికి మూర్ఛ (ఫిట్స్/సీజర్స్) వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గాయాల సంరక్షణ (ట్రామా కేర్), ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఏఈడీ) వినియోగం, అలాగే కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) నిర్వహించే విధానాలపై వైద్య విద్యార్థులు ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా శిక్షణ అందించారు. అత్యవసర పరిస్థితుల్లో మొదటి కొన్ని నిమిషాల్లో సరైన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని నిపుణులు వివరించారు.

ఈ కార్యక్రమానికి సేవార్థ్ క్లబ్ అధ్యక్షుడు ఆర్. కె. శ్రీరామ్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు కె. సాహితి, కార్యవర్గ సభ్యులు దీప్నా రెడ్డి, సంచిత, ఉషశ్రీ, లియాఖత్ అలీ, శ్రీశైలం, శ్రీజ, నీరజ్, జయానంద్, సెహారిక,వంశీ ఆకాంక్ష సమన్వయం వహించారు. వాలంటీర్లుగా శ్రావిక, తుల్య, నీతూ, అఖిల్, దీపక్, సురేష్, అక్షిత, సుష్మ, జార్జీనా సేవలందించారు. కాకతీయ వైద్య కళాశాలకు చెందిన మొత్తం 20 మంది సేవార్థ్ క్లబ్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

విత్తన డీలర్లతో అత్యవసర సమావేశం

ప్రజా వాయిస్, కొత్త గూడ : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఎం ఎ ఓ జక్కుల ఉదయ్ మాట్లాడుతూ ఆగస్టు 20 నుంచి అమలులోకి రానున్న ఫ్ .ఫ్ . ఎస్ యాప్పై డీలర్లకు అవగాహన కల్పించారు. నిషేధిత పారాక్యాట్ మందు నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఎం.ఆర్.పీ. కంటే ఎక్కువ ధరకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తే రైతులు వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆస్పత్రి నుంచి ఇంటికి చేరకముందే విషాదం!

- **కానిస్టేబుల్ మృతి..ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన**
- **వికారాబాద్ పట్టణంలోని మెడిక్యూర్ ఆస్పత్రిలో ఘటన**

ప్రజా వాయిస్, వికారాబాద్: చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూరుకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నరేష్ ఛాతిలో నొప్పితో వికారాబాద్‌లోని మెడిక్యూర్ ఆసుపత్రికి వచ్చారు.ఆసుపత్రిలో వైద్యులు నరేష్‌కు ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే డిశ్చార్జ్ చేసిన కొద్దిసేపటికే ఆసుపత్రిలోనే నరేష్ కుప్పకూలి మృతి చెందినట్లు పేర్కొన్నారు.

ఈ ఘటనతో ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు.కుటుంబ సభ్యులకు పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలూరు గ్రామస్తులు కూడా ఆసుపత్రి వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులకు మద్దతుగా నిలిచారు.

గుమ్మనూరులో నీటి సమస్య తక్షణమే పరిష్కరిస్తాం

- **కలెక్టర్ హామీ**
- **ఎస్సారెస్పీ 83వ మైలురాయి కెనాల్ మరమ్మతులకు సర్పంచ్ వినతి**

ప్రజా వాయిస్ , మంథని : మండలం లోని గుమ్మనూరు గ్రామ పంచాయతీలో ఎదురవుతున్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. గుమ్మనూరు గ్రామ సర్పంచ్ సురేష్ గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి, ప్రజల ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మరొక ముఖ్యమైన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సారెస్పీ కెనాల్ కాల్వ 83వ తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. కాల్వ మరమ్మతులు పూర్తి చేస్తే గ్రామానికి సాగు సులువుగా అందుతుందని, సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. సర్పంచ్ తెలిపిన వివరాలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఎస్సారెస్పీ కెనాల్ కాల్వ 83 మరమ్మతు పనులను కూడా వేగవంతం చేసి, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టం చేశారు.

పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీల నిరసన

- **సమస్యలు పరిష్కరించే వరకు పోరాటమే అంటున్న ఉపాధ్యాయులు**

ప్రజా వాయిస్, గుర్రంపోడ్ మండలం: నల్గొండ జిల్లా, గుర్రంపోడ్ మండలంలోని యూ.ఎస్.పి.సి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉపాధ్యాయ మరియు విద్యా రంగంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం దశల వారీ పోరాట కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు.పాఠశాల స్థాయిలోనే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అందరూ ఒకతాటిపైకి వచ్చి, పాఠశాల విరామ సమయంలో (ఇంటర్వెల్) నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల హక్కుల రక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మంజుల, యాదగిరి రెడ్డి, సైదయ్య, సునీల్, అశోక్ రెడ్డి, దస్తగిరి, శ్రీనివాసులు, వెంకటరెడ్డి, నరసింహ, శ్రీధర్ రెడ్డి మరియు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద యువతకు బుసిరెడ్డి ఫౌండేషన్ భరోసా

- **ఉచిత ఎస్ఐ–కానిస్టేబుల్ శిక్షణకు బంగారు అవకాశం**

ప్రజా వాయిస్, గుర్రంపోడ్ మండలం: గ్రామీణ ప్రాంతాల్లోని పేద నిరుద్యోగ యువతీ యువకులకు అండగా నిలిచేందుకు బుసిరెడ్డి ఫౌండేషన్ అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది.ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ మరియు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న ఇంగ్లీష్ మరియు తెలుగు మీడియం అభ్యర్థుల కోసం 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నల్గొండలోని హైదరాబాద్ రోడ్డులో గల 'భవిత ఇన్స్టిట్యూట్' లో ఈ క్లాసులు నిర్వహించనున్నారు. ఈ ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఈనెల 16 ఆగస్టు 2026 ఉదయం 10:00 గంటలకు భవిత ఇన్స్టిట్యూట్ లో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి 19 ఆగస్టు 2026 నుండి ఉదయం 9:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉచితంగా తరగతులు నిర్వహిస్తారు. అర్హులైన గ్రామీణ పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 7893262654, 9177668477 నంబర్లలో సంప్రదించాలని ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.

లోటు వర్షపాత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

- **తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి**
- **మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

ప్రజా వాయిస్, హన్మకొండ జిల్లా ప్రతినిధి : ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటి అవసరం ఉండే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వానాకాలం సాగు, వన మహోత్సవం, సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువులు, స్మార్ట్ రేషన్ కార్డుల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని, అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వానాకాలం సాగు కోసం గోదావరి, కృష్ణా బేసిన్లలోని ప్రాజెక్టుల నుంచి సాగునీటి విడుదలకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. వన మహోత్సవం కింద రాష్ట్రంలో 16.06 కోట్ల మొక్కలు నాటే లక్ష్యానికి ఇప్పటివరకు 6.28 కోట్ల మొక్కలు నాటడం, పంపిణీ చేయడం ద్వారా 39 శాతం ప్రగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. నాటిన ప్రతి మొక్కను టీజీఫమిస్ పోర్టల్‌లో జియో ట్యాగింగ్ చేసి, మనుగడను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ''ఒకే చెరువు–ఆరు రకాల జీవనోపాధులు'' అనే లక్ష్యంతో నీటిపారుదల, చేపల పెంపకం, పాడి పరిశ్రమ, కూరగాయల సాగు, పశుగ్రాసం, సేంద్రీయ ఎరువుల తయారీ ద్వారా మహిళా రైతుల ఆదాయం పెంచేలా శాఖల సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అధునాతన భద్రతా ఫీచర్లతో రూపొందించిన తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పౌరసరఫరాల వ్యవస్థను మరింత పారదర్శకంగా, భద్రతాయుతంగా మార్చనున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుంచి జిల్లా ఇంచార్జి కలెక్టర్ రవి, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ వెంకన్న,వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షిస్తూ, వానాకాలం సాగు, పంటల మార్పు, ప్రత్యామ్నాయ పంటలు, వన మహోత్సవం, క్షేత్ర చెరువుల నిర్మాణం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత గడువులో లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డీఎఫ్ఓ ముకుందారెడ్డి, పరకాల మునిసిపల్ కమిషనర్ పవన్ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, ఆర్డీఓ వెంకటేశ్, డీఆర్‌డీఓ శ్రీను, జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణకు సోలార్, బ్యాటరీ స్టోరేజ్‌పై దృష్టి

- **రియాక్టివ్ పవర్ నియంత్రణతో నష్టాల తగ్గింపు, సామర్థ్యం పెంపు**
- **టీజీఎన్‌పీడీసీఎల్‌లో 2 MVAR, 600 kVAR కెపాసిటర్ బ్యాంకుల వినియోగం**
- **ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ వెల్లడి.**

ప్రజా వాయిస్, హన్మకొండ జిల్లా ప్రతినిధి : విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా, నాణ్యంగా మరియు ఆర్థికంగా బలోపేతం అయ్యే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు . శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో ఇంధన శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొనగా, హన్మకొండ నక్కలగుట్టలో ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధ్యక్షతన డైరెక్టర్లు,చీఫ్ ఇంజనీర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వివరించారు. ఇందులో 33/11 kV సబ్‌స్టేషన్లలో సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు, రియాక్టివ్ పవర్ కాంపెన్సేషన్ కోసం 2 MVAR కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటు గురించి వివరించారు. రోజు రోజుకు విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో పీక్ అవర్స్‌లో విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద సోలార్, బ్యాటరీ స్టోరేజ్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను వివరించారు . . సోలార్ విద్యుత్‌తో బ్యాటరీలను ఛార్జ్ చేసి, అవసరమైన సమయంలో ముఖ్యంగా సాయంత్రం పీక్ అవర్స్‌లో నిల్వ విద్యుత్‌ను వినియోగించడం ద్వారా మార్కెట్ ఆధారిత విద్యుత్ కొనుగోళ్లపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఛార్జింగ్ సమయంలో ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలను తగ్గించడంతో పాటు అదనపు గ్రిడ్ లోడింగ్‌ను నివారించవచ్చని చెప్పారు . 33 కేవీ ఫీడర్లపై రియాక్టివ్ కరెంట్‌ను తగ్గించడం లక్ష్యంగా 347 సబ్‌స్టేషన్లలో 2 MVAR కెపాసిటర్ బ్యాంకులు పెట్టామని చెప్పారు . 2 MVAR కెపాసిటర్ బ్యాంకు కరెంట్‌ను తగ్గించి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి. మోహన్ రావు, వి. తిరుపతి రెడ్డి, టి . మధుసూదన్ , జియంలు ప్రభావతి, డి.ఈలు కె. అనిల్ కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటానికి సిద్ధం కావాలి

ప్రజా వాయిస్, వేములపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల వైఫల్యాలపై కార్యకర్తలు మరో పోరాటానికి సిద్ధం కావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం నల్గొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు భరత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త పాటుపడాలని ప్రజాసంస్థలపై గ్రామస్థాయిలో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు వారి పరిష్కారానికి కృషి చేయాలన్నారు ప్రతి గ్రామంలో గ్రామస్థాయి కమిటీలను నియమించి అవి క్రియాశీలకంగా పనిచేసేలా మండల కమిటీ చూడాలన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బంటు సైదులు, ఎడ్ల రమేష్, సీతారాంరెడ్డి, సైదులు ప్రసాద్ రెడ్డి ఉపేందర్ పురుషోత్తం ప్రభాకర్ మహేష్ నరేష్ మధు నితీష్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

ఈ నెల 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజా వాయిస్, హనుమకొండ : జిల్లాలో ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుందని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి చేరుకున్న స్మార్ట్ రేషన్ కార్డులను ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం జిల్లాలో కార్డుల పంపిణీకి చేపట్టాల్సిన ఏర్పాట్లపై పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 14 మండలాలకు మొత్తం 2,56,838 స్మార్ట్ రేషన్ కార్డులు అందినట్లు అధికారులు తెలిపారు. మండలాల వారీగా ఆత్మకూరు 11,641, భీమదేవరపల్లి 15,783, దామెర 9,264, ధర్మసాగర్ 17,069, ఎల్కతుర్తి 14,055, హనుమకొండ 44,283, హసన్‌పర్తి 26,220, ఐనవోలు 15,389, కమలాపూర్ 22,095, కాజీపేట 30,959, నడికూడ 11,658, పరకాల 14,714, శాయంపేట 14,884, వేలేరు 8,824 కార్డులు వచ్చినట్లు వివరించారు.

ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రేషన్ షాపు పరిధిలోని లబ్ధిదారులకు కార్డులు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ ప్రక్రియను సమన్వయం చేసేందుకు ప్రతి మండలానికి నోడల్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మహేందర్, పౌరసరఫరాల శాఖ డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతతో కాలువలో డ్రాప్ పనులు చేపట్టాలి

- **కొండాపురం,రెడ్లకుంట వరకు 20 కి.మీ. మేర రూ.47.64 కోట్లతో నిర్మాణం**
- **బాలాజీనగర్ శివారులో కాలువలో జరుగుతున్న డ్రాప్ పనులను పరిశీలించిన ఈఈ సత్యనారాయణ**
- **20,068 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు.. నాణ్యతపై అధికారులకు సూచనలు**

ప్రజా వాయిస్, కోదాడ: భారీ వ్యయంతో చేపడుతున్న కాలువలో డ్రాప్ నిర్మాణ పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని సూర్యాపేట ఈఈ జె. సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. కొండాపురం నుంచి రెడ్లకుంట వరకు 20 కిలోమీటర్ల మేర రూ.47.64 కోట్లతో చేపడుతున్న డ్రాప్ పనుల్లో భాగంగా కోదాడ పట్టణంలోని బాలాజీనగర్ శివారులో కాలువలో జరుగుతున్న డ్రాప్ నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు.పనుల నాణ్యత, పురోగతిని పరిశీలించిన ఈఈ.. డీఈ పంతుల్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు.కాలువలో డ్రాప్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల్లో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. నిర్ణీత ప్రమాణాల మేరకు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కాలువ కింద సుమారు 20,068 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందని ఈఈ తెలిపారు. కాలువలో డ్రాప్ నిర్మాణం పూర్తయితే నీటి పారుదల వ్యవస్థ మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఈ పంతుల్య, ఏఈతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రజల అవస్థలు

- **మోడీని గద్దె దింపే వరకు సిపిఐ పోరు**
- **సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**
- **ముల్కనూర్ లో సిపిఐ పాదయాత్రలో చాడ**

ప్రజా వాయిస్, హన్మకొండ జిల్లా ప్రతినిధి : దేశంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహిస్తుందని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలే దాని పతనానికి దారి తీస్తుందని, దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ ప్రచార జాత పాదయాత్ర 2వ రోజు ముల్కనూర్ లో ప్రచార జాత పాదయాత్ర సహకార బ్యాంకు నుండి కొత్తపల్లి వరకు ఉత్సాహపూరితంగా సాగింది. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అంబేద్కర్ విగ్రహంకు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని అయిందా అని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీస్తుందని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని అన్నారు. సహజ వనరులను కార్పొరేట్ మిత్రులు అదానీ, అంబానీ లకు కట్టబెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ దేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, విద్య, ఆరోగ్యం ప్రజలకు అందుబాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, దళితులపై, మహిళలపై అకృత్యాలను, దాడులను నిలిపివేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంకై ఆగస్టు 6 నుండి దేశవ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై సెప్టెంబర్ 1వ తేదీన ఢిల్లీలో దేశంలో మార్పు కోసం మహా ర్యాలీతో ముగుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే సిపిఐ పోరు ప్రచార జాత పాదయాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి , జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, ఎన్ ఎ స్టాలిన్, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, శనిగరపు రాజ్ కుమార్, రాసమల్ల దీనా, గుంటి రాజేందర్, బీమదేవరపల్లి మండల కార్యదర్శి అదరి రమేష్, మండల నాయకులు కొంగల రామచంద్ర రెడ్డి, కంపంపల్లి కిషన్, రాగుల చంద్రయ్య, చిలక శ్రీను, నిమ్మల మనోహర్, మాలోతు మంగ, మమత, కుడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభలో వాటా కోసం సమర శంఖం

- **ఆధిపత్య రాజకీయాలకు చరమగీతం పాడాలి**
- **బీసీలు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగినప్పుడే సామాజిక న్యాయం సాధ్యం: సాయిని నరేందర్**

ప్రజా వాయిస్,హనుమకొండ: మండల్ కమిషన్ స్ఫూర్తితో బీసీల హక్కుల సాధనకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. బీసీలు రాజకీయంగా బలపడినప్పుడే రాజ్యాధికారం, సామాజిక న్యాయం, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం సాధ్యమవుతుందని అన్నారు.మండల్ కమిషన్ సిఫారసుల మేరకు ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని అప్పటి ప్రధాని వీపీ సింగ్ నిర్ణయం తీసుకున్న ఆగస్టు 7ను పురస్కరించుకుని హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో మండల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సాయిని నరేందర్ మాట్లాడుతూ 1980లో సమర్పించిన మండల్ కమిషన్ నివేదికను 1990 ఆగస్టు 7న వీపీ సింగ్ ప్రభుత్వం అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లు, కులగణన విషయంలో రాజకీయ పార్టీలు సరైన న్యాయం చేయడం లేదని ఆరోపించారు. మండల్ డేను కేవలం వేడుకగా కాకుండా హక్కుల సాధనకు పోరాట స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కొంగ వీరస్వామి మాట్లాడుతూ బీసీ మేధావులు, నిపుణులు హక్కుల ఉద్యమంలో ముందుండాలని కోరారు. రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే మాట్లాడుతూ పూలే నుంచి కాన్షీరాం వరకు జరిగిన సామాజిక ఉద్యమాలను స్ఫూర్తిగా తీసుకుని బీసీ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుపాక ఎల్లన్న, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చుంచు రాజేందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జన్ను పద్మ, తుమ్మ తిరుపతి, అంకేశ్వరపు రాంచందర్, సద్గుణ, సూరం నిరంజన్, స్వరూప, జల్లెల కృష్ణమూర్తి, మీరాస్వామి యాదవ్, సురేఖ, బైరి దీప, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.